ANGRAU
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

# వ్యవసాయం

వ్యవసాయ సచిత్ర మాస పత్రిక

సంపుటి - 15 | సంచిక - 09 | సెప్టెంబరు 2023 | పేజీలు - 44 | వెల రూ. 20/-







ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం నుండి సాగుకు ఆమోదించిన నూతన రకాలు.

బంగాళ దుంప సాగు




పైనాపిల్‌తో విలువ ఆధారిత ఉత్పత్తులు



తొలిదశలో కంది పంటను ఆశించే పురుగులు, తెగుళ్ళు

# ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయములో జరిగిన

# వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక



77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు @ పరిపాలనా భవనం, లాం.



మేరీ మట్టి – మేరీ దేశ్ కార్యక్రమం @ సామాజిక విజ్ఞాన కళాశాల, లాం.



శ్రీ బళ్ళారి రాఘవ గారి జయంతి @ పరిపాలనా భవనం, లాం.



రైతులకు సాంకేతికతను చేరవేసేందుకు స్ట్రాటజీని అభివృద్ధి పరచుట, డిజిటల్ టూల్స్‌పై ఇంటరాక్టివ్ వర్క్ షాప్ @ కృష్ణా ఆడిటోరియం, ఆర్.ఎ.ఆర్.ఎస్., లాం.

ANGRAU

# వ్యవసాయం

సెప్టెంబరు - 2023

శ్రీ శోభకృత్ నామ సం॥
నిజ శ్రావణ మాస బ.విదియ
మొ॥ భాద్రపద మాస బ.పాడ్యమి
వరకు

## సంపాదక వర్గం

ప్రధాన సంపాదకులు
**డా॥ ఎ. లలిత**
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి (ఎఫ్.ఎ.సి.)

సంపాదకులు
**డా॥ యం. వెంకటరాములు**
సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ)

వ్యవసాయం మాస పత్రిక
సంవత్సర చందా రూ. 200/- లేదా
జీవితకాల (10 సంవత్సరములు) చందా
రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి.
రూపంలో చెల్లించవచ్చు.
మని ఆర్డర్ లేదా డి.డి అయితే PRINCIPAL AGRICULTURAL INFORMATION OFFICER, GUNTUR, ANDHRA PRADESH పేరిట తీసి గుంటూరులో చెల్లే విధంగా పంపించాలి.

చిరునామా :
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము
అడ్వాన్స్‌డ్ పోస్టు గ్రాడ్యుయేషన్ సెంటర్ ఆవరణ,
లాం, గుంటూరు - 522 034, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 91005 00223
ఈ-మెయిల్ : paio@angrau.ac.in

## విషయ సూచిక

1. ఉపకులపతి సందేశం ..... 5
2. విస్తరణ సంచాలకుల సందేశం ..... 6
3. వివిధ పంటలలో ఈ మాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు ..... 7
4. సాంకేతిక వ్యాసాలు
- ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము నుండి 2023 లో వివిధ పంటలలో రాష్ట్ర స్థాయిలో సాగుకు ఆమోదించిన నూతన రకాలు ..... 16
- వరిలో ముఖ్యమైన నాణ్యతా లక్షణములు ..... 19
- వరి అనంతరం జొన్న సాగు ఉత్పత్తిలో సాంకేతికత. 21
- తొలి దశలో కంది పంటను ఆశించే పురుగులు ..... మరియు తెగుళ్ళ యాజమాన్యం ..... 23
- వేరుశనగలో మొదలు కుళ్ళు తెగులు యాజమాన్యం 26
- కుసుమ సాగులో మెళకువలు ..... 27
- గిరిజన ప్రాంతంలో బంగాళదుంప సాగులో మెళకువలు ..... 30
- టిష్యూ కల్చర్ అరటి సాగులో పాటించవలసిన మెలకువలు ..... 32
- పైనాపిల్‌తో విలువ ఆధారిత ఉత్పత్తులు ..... 33
- వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర - వారిని బలోపేతం చేసే మార్గాలు ..... 36
5. విశ్వవిద్యాలయ వార్తలు ..... 38
6. రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు ..... 39
7. కర్షక విజయాలు
- నిరంతర సాగుతో నిలకడ ఆదాయం ..... 41

పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను
తమ అమూల్యమైన సలహాలను, సూచనలను అందచేయవలసిందిగా కోరుచున్నాము.

# సెప్టెంబరు మాసం క్యాలెండర్ - 2023

| SUN<br>ఆది | MON<br>సోమ | TUE<br>మంగళ | WED<br>బుధ | THU<br>గురు | FRI<br>శుక్ర | SAT<br>శని |
|---|---|---|---|---|---|---|
| | | | | | **1**<br>బ.విదియ తె. 3-21<br>పూర్వాభాద్ర సా. 6-48<br>తె.వ. 3-49 ల 5-19 | **2**<br>తదియ రా. 1-15<br>ఉత్తరాభాద్ర సా. 5-22<br>తె.వ. 4-46 ల |
| **3**<br>చవితి రా. 11-24<br>రేవతి సా. 4-11<br>ఉ.శే.వ. 6-17 | **4**<br>పంచమి రా. 9-54<br>అశ్విని ప. 3-18<br>ఉ.వ. 11-26 ల 12-59,<br>రా.వ. 12-41 ల 2-15 | **5**<br>షష్ఠి రా. 8-46<br>భరణి ప. 2-47<br>రా.వ. 2-45 ల 4-20 | **6**<br>సప్తమి రా. 8-07<br>కృత్తిక ప. 2-43<br>వర్జ్యము లేదు | **7**<br>అష్టమి రా. 7-56<br>రోహిణి ప. 3-08<br>ఉ.వ. 6-59 ల 8-37,<br>రా.వ. 8-56 ల 10-36 | **8**<br>నవమి రా. 8-17<br>మృగశిర సా. 4-03<br>రా.వ. 12-56 ల 2-38 | **9**<br>దశమి రా. 9-08<br>ఆర్ద్ర సా. 5-27<br>వర్జ్యము లేదు |
| **10**<br>ఏకాదశి రా. 10-25<br>పునర్వసు రా. 7-18<br>ఉ.వ. 6-22 ల 8-06,<br>తె.వ. 4-02 ల 5-47 | **11**<br>ద్వాదశి రా. 12-05<br>పుష్యమి రా. 9-31<br>వర్జ్యము లేదు | **12**<br>త్రయోదశి రా. 2-01<br>ఆశ్రేష రా. 12-00<br>ఉ.వ. 11-38 ల 1-24 | **13**<br>చతుర్దశి తె. 4-05<br>మఘ రా. 2-36<br>ప.వ. 1-18 ల 3-04 | **14**<br>అమావాస్య పూర్తి<br>పుబ్బ తె. 5-09<br>ఉ.వ. 11-27 ల 1-13 | **● 15**<br>అమావాస్య ఉ. 6-07<br>ఉత్తర పూర్తి<br>ప.వ. 1-03 ల 2-49 | **16**<br>శు.పాడ్యమి ఉ. 7-53<br>ఉత్తర ఉ. 7-32<br>సా.వ. 4-37 ల 6-21 |
| **17**<br>విదియ ఉ. 9-17<br>హస్త ఉ. 9-31<br>సా.వ. 6-02 ల 7-44 | **18**<br>తదియ ఉ. 10-15<br>చిత్ర ఉ. 11-05<br>సా.వ. 4-55 ల 6-36 | **19**<br>చవితి ఉ. 10-43<br>స్వాతి ప. 12-09<br>సా.వ. 5-52 ల 7-31 | **20**<br>పంచమి ఉ. 10-39<br>విశాఖ ప. 12-43<br>సా.వ. 4-44 ల 6-20 | **21**<br>షష్ఠి ఉ. 10-08<br>అనూరాధ ప. 12-49<br>సా.వ. 6-19 ల 7-54 | **22**<br>సప్తమి ఉ. 9-07<br>జ్యేష్ఠ ప. 12-27<br>రా.వ. 8-11 ల 9-44 | **23**<br>అష్టమి ఉ. 7-43, నవమి<br>తె. 5-57 ,మూల ఉ. 11-42<br>ఉ.వ. 10-08 ల 11-42,<br>రా.వ. 8-51 ల 10-23 |
| **24**<br>దశమి తె. 3-50<br>పూర్వాషాఢ ఉ. 10-37<br>సా.వ. 6-09 ల 7-40 | **25**<br>ఏకాదశి రా. 1-37<br>ఉత్తరాషాఢ ఉ. 9-16<br>ప.వ. 1-00 ల 2-30 | **26**<br>ద్వాదశి రా. 11-15, శ్రవణం<br>ఉ. 7-45, ధనిష్ఠ తె. 6-05<br>ప.వ. 11-28 ల 12-57 | **27**<br>త్రయోదశి రా. 8-49<br>శతభిషం తె. 4-26<br>ప.వ. 12-47 ల 2-16 | **28**<br>చతుర్దశి సా. 6-26<br>పూర్వాభాద్ర రా. 2-48<br>ఉ.వ. 10-23 ల 11-53 | **29**<br>○ పూర్ణిమ సా. 4-09<br>ఉత్తరాభాద్ర రా. 1-20<br>ఉ.వ. 11-48 ల 1-18 | **30**<br>బ.పాడ్యమి ప. 2-02<br>రేవతి రా. 12-06<br>ప.వ. 12-43 ల 2-14 |

## పుబ్బ కార్తె (31.08.2023 నుండి 12.09.2023)

| | | |
|---|---|---|
| వరి | : | రసాయనిక ఎరువులు వేయుట, సస్యరక్షణ, కలుపు తీయుట, |
| జొన్న | : | రబీ జొన్న వేయుటకు దుక్కులు తయారు చేయుట మరియు మాఘీ జొన్న |
| వేరుశనగ | : | సస్యరక్షణ, కలుపు తీయుట |
| ఆముదం | : | సస్యరక్షణ, ఎరువులు వేయుట |

## ఉత్తర కార్తె (13.09.2023 నుండి 26.09.2023)

| | | |
|---|---|---|
| వరి | : | సస్యరక్షణ, కేళీల ఏరివేత, మెట్ట వరి సాగు కోత పనులు |
| వేరుశనగ | : | సస్యరక్షణ |
| ఆముదం | : | సస్యరక్షణ |
| పొగాకు | : | నారుమడిలో సస్యరక్షణ, పొగాకు వేయబోయే చేలలో దుక్కులు దున్నుట |
| నువ్వులు | : | జూన్ నెలలో వేసిన పైరు కోతలు |
| ప్రత్తి | : | సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట |
| పొగాకు | : | పొగాకు వేయు చేలలో దుక్కులు దున్నటం కొనసాగించుట |
| చెఱకు | : | జడచుట్లు వేయుట |
| మొక్కజొన్న | : | కోతలు |
| రాగి / సజ్జ | : | కోతలు |

# వ్యవసాయ మహిళల సర్వతోముఖాభివృద్ధి దేశ ప్రగతికి మూలం



**డా॥ ఆర్. శారద జయలక్ష్మి దేవి**
ఉపకులపతి
ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

వ్యవసాయ రంగంలో మహిళలు కీలకమైన పాత్ర కలిగి ఉన్నారు. వ్యవసాయ కార్యకలాపాలల్లో మహిళలు 60 శాతం కంటే ఎక్కువ శ్రమ శక్తిని అందిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు పని చేయడం ద్వారా వారు పని ఒత్తిడికి మరియు శారీరక శ్రమకు లోనవుతున్నారు. పంట విత్తిన దగ్గర నుండి పంట కోత వరకు ప్రతి దశలో మహిళలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో మహిళలకు లభించే పని ఎంతో శ్రమతో కూడినటువంటిది. మగవాళ్ళతో పోలిస్తే వ్యవసాయ మహిళలు కూలీ పంపిణీ, భూ యాజమాన్యం, రుణం మరియు ఇతర సహకార సేవల లభ్యతలో తీవ్రమైన ప్రతికూలతను ఎదుర్కొంటున్నారు. అందువల్ల, వారికి వ్యవసాయ ఉత్పత్తులు పెంపొందించే సామర్థ్యం తద్వారా అదనపు ఆదాయం లేక తమకి మరియు తమ కుటుంబానికి పోషక, విద్య మరియు ఆరోగ్య స్థితి బలహీన పడటం జరుగుతున్నది.

దేశ జనాభాలో మహిళలు సుమారుగా సగ భాగమైనందువలన భారతదేశాభివృద్ధి మహిళా సాధికారతతోనే సాధ్యం. మహిళా సాధికారత ప్రధాన కోణం సూక్ష్మరుణాల ద్వారా ఆర్థిక స్వయం స్థిరత్వం. సూక్ష్మ రుణాల కార్యక్రమాల ద్వారా సమూహాలుగా ఏర్పడ్డ పేద మహిళలకు ఆర్థిక సహకారం అందజేసి వారిలో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని, నైపుణ్యతను, విద్య, పోషక మరియు లింగ సమానత్వంతో కుటుంబ సంక్షేమానికి మరియు సామాజిక, రాజకీయ సాధికారతకు తోడ్పడుతున్నాయి. మహిళలకు ఆర్థిక సహకారం అందించడంలో నాబార్డు (జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు) మార్గదర్శకంగా నిలిచింది. మన దేశంలో, ముఖ్యంగా పొదుపు సంఘాలు మరియు సూక్ష్మ రుణాల సంస్థలు మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. వీటితో పాటు కో ఆపరేటివ్ సంస్థలు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రైవేటు సంస్థలు, మహిళా బ్యాంకులు, మహిళా సమాఖ్యలు వంటివి కూడా పేద మహిళలకు అన్ని విధాల సహకారం అందించి వారి సామర్థ్యాన్ని సాధికారతను పెంపొందించే దిశలో కృషి చేస్తున్నాయి.

మహిళల సర్వతోముఖాభివృద్ధి సాధనలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తన వంతు పాత్ర పోషిస్తున్నది. కృషి విజ్ఞాన కేంద్రాలు మరియు గృహ విజ్ఞాన విభాగం ద్వారా వృత్తి శిక్షణలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రదర్శనలు, కిసాన్ మేళాలు, సందర్శనలు, శ్రమ తగ్గింపు పరిజ్ఞానం వంటి కార్యక్రమాలు చేపట్టి మహిళలకు ఉపాధి తద్వార అదనపు ఆదాయాన్ని కల్పిస్తున్నారు. అంతేకాకుండా అన్ని కార్యక్రమాలలో మహిళలకు ప్రాముఖ్యత మరియు గుర్తింపు కలిగే చర్యలు తీసుకుంటున్నారు. అలాగే విస్తరణ సంస్థల ద్వారా శిక్షణా, నైపుణ్యత అభివృద్ధి మరియు ఇతర లింకేజీలు పొందుతూ నేటి మహిళలు సామాజికంగా మరియు ఆర్థికంగా బలపడి దేశ పేదరిక నిర్మూలానికి సమర్థవంతమైన శక్తులుగా ముందుకు అడుగులు వేస్తారని ఆశిస్తున్నాను.

రెడ్డిపోగు శారద జయలక్ష్మి దేవి
(ఆర్. శారద జయలక్ష్మి దేవి)

# మహిళల వ్యవస్థాపకతతో సాధికారతకు సోపానం



**డా॥ ఏ. సుబ్బరామి రెడ్డి**
విస్తరణ సంచాలకులు
ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

భారతదేశంలో వ్యవసాయమే జీవన విధానం మరియు సాంప్రదాయంగా వస్తున్న వృత్తి. మన దేశ వ్యవసాయ రంగంలో స్త్రీల సంఖ్య, వారి పాత్ర ముఖ్యమైనది. వ్యవసాయం జీవనాధార వృత్తి కావడంతో నిర్ణయాధికారం, ఆర్థిక స్వాతంత్ర్యం, అక్షరాస్యత, ఆరోగ్య సేవలతో నేరుగా ముడిపడి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులలో, మహిళలకు నిర్ణయం తీసుకునే నైపుణ్యత, జీవితంపై అభిలాష మరియు కుటుంబ బాధ్యతలు పెరగడంతో వారు మగవాళ్ళతో సమానంగా నిలబడి పోటీ పడే స్ఫూర్తిని పొందుతున్నారు. మహిళా వ్యవస్థాపకత ద్వారా వారికి ఆర్థిక స్వతంత్ర్యంతో పాటు సామాజిక – ఆర్థిక సాధికారిత కూడా మెరుగుపడుతుంది.

మహిళా వ్యవస్థాపకత ద్వారా స్త్రీలకు ఆదాయాన్ని స్థిరీకరించి, సామర్థ్యాన్ని పెంపొందించుకొని కుటుంబానికి కావలసిన పోషక, సామాజిక, ఆహార సంబంధిత కనీస అవసరాలు చేరుకోవడం జరుగుతుంది. గ్రామీణ మహిళలు తమకు అందుబాటులో ఉన్న అనుకూలమైన వ్యవస్థలపై శ్రద్ధ చూపితే, మన సాంప్రదాయ వృత్తిగా వున్న వ్యవసాయంలో ఉంటూనే కుటుంబానికి అదనపు ఆదాయం మరియు ఉపాధి కలిగించుకోవచ్చును. ఉదాహరణకు పచ్చళ్ళు మరియు అప్పడాల తయారి, టైలరింగ్ మరియు ఎంబ్రాయిడరీ, పుట్టగొడుగుల పెంపకం, చిరు ధాన్యాల ఉత్పత్తి, డెయిరి, కోళ్ళ పెంపకం, బేకరి, పూల ఉత్పత్తి, నర్సరీలు, బుక్ బైండింగ్స్, ఫ్యాన్సీ స్టోర్స్ మొ॥ వ్యాపారాలను సమర్థవంతంగా నడుపుతున్నారు. మహిళలు తమ ఆలోచన విధానాన్ని మార్చుకొని తమకున్న పరిధిలోనే నికర ఆదాయం పొందడం వారికి, వారి కుటుంబానికి గొప్ప విజయం. అలాంటి వారిని ప్రోత్సహించి మహిళల సర్వతోముఖాభివృద్ధికి తద్వారా దేశ ప్రగతికి సోపానం అందించగలము.

ఈ పరిస్థితులలో మహిళా అభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థలన్ని సమర్థవంతమైన చర్యలు ద్వారా వారికి పారిశ్రామిక అవగాహన మరియు నైపుణ్య అభివృద్ధిని కల్పించాలి. స్వయం ఉపాధి పట్ల గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించి, వారికున్న బలాన్ని మరియు అవకాశాలను గుర్తించేలా ప్రోత్సహించి వాటికి అనుకూలంగా మార్కెట్ డిమాండ్లను అనుసరించే నైపుణ్యతను మెరుగు పరచేలా సంస్థలన్నీ కలిసి శ్రమించాలి. మన కృషి విజ్ఞాన కేంద్రాలు కూడా వృత్తివిద్య శిక్షణల ద్వారా మహిళలకు చేయూతనందించి ఎంతో మంది మహిళల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నాయి. అలాగే వ్యవసాయ విశ్వవిద్యాలయపు విస్తరణ కార్యక్రమాలలో మహిళా రైతులకు తగిన ప్రాధాన్యతనిస్తూ వారిలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం.

మన సమాజం మహిళల పట్ల ఆలోచన విధానాన్ని సానుకూలంగా మార్చుకొని వారికి తగిన చేయూతనందిస్తే రానున్న కాలంలో మహిళలు కూడా మన దేశ ఆర్థిక అభివృద్ధికి కీలక భాగస్వామ్యం వహించగలరు.

(ఏ. సుబ్బరామి రెడ్డి)




**వ**ర్షాభావ పరిస్థితులు మరియు ఆలస్యంగా కాలువలకు నీటి విడుదల వలన రాష్ట్రంలోని చాలా ప్రాంతాలలో నారు మళ్ళు మరియు నేరుగా విత్తే వరి ఆలస్యంగా వేయడం జరిగింది. ఉత్తర కోస్తా జిల్లాలు, అత్యల్ప వర్షపాత మండలంలోని జిల్లాలు, గుంటూరు మరియు ప్రకాశం జిల్లాల్లో నాట్లు సెప్టెంబరులో కూడా జరిగే అవకాశం వున్నది కనుక ఈ క్రింది సూచనలు ఆచరించ వలెను.

- సాధ్యమైనంత వరకు లేత వయస్సు వున్న నారును (25-35 రోజులు) నాటుకొనవలెను.
- ముదురు నారు (40-55 రోజులు) నాటుకొనవలసి వచ్చినపుడు నాట్లు దగ్గర దగ్గరగా, ఒత్తుగా వేసుకోవాలి.
- వరి రైతులు సిఫారసు చేసిన మేరకే (పిలకల దశలో ఒక అంగుళం, చిరుపొట్ట దశలో రెండు అంగుళాలు) నీటిని వినియోగించుకుని మెరుగైన దిగుబడులు పొందాలని సూచన.
- కలుపు నివారణకు విత్తిన లేదా నాటిన 8-10 రోజులకు పైరాజోసల్ఫ్యూరాన్ ఇథైల్ ఎకరానికి 100 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో పిచికారి చేయాలి. విత్తిన లేదా నాటిన 15-20 రోజులకు ఎకరానికి బిస్పైరిబాక్ సోడియం 10% ఎస్.ఎల్. 100 మి.లీ. లేదా ట్రైయఫామోన్ + ఇథాక్సి సల్ఫ్యూరాన్ 30% డబ్ల్యు.జి. 90 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయడం ద్వారా గడ్డి మరియు వెడల్పాకు కలుపు మొక్కలను సమర్ధవంతంగా నివారించవచ్చు.
- కేవలం గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉంటే సైహలోఫాప్ బ్యుటైల్ 10% ద్రావకం 400 మి.లీ. లేదా ఫెనాక్సాఫాప్ పి ఈథైల్ 6.9% ఇ.సి. 400 మి.లీ. ఒక ఎకరానికి చొప్పున పిచికారి చేయాలి.
- విత్తిన లేదా నాటిన 25-30 రోజులకు మెటాసల్ఫ్యూరాన్ మిథైల్ + క్లోరిమ్యూరాన్ ఇథైల్ 20% డబ్ల్యు.పి. 8 గ్రా. ఎకరానికి పిచికారి చేయాలి. వెడల్పాటి ఆకులున్న కలుపు మొక్కలున్నట్లయితే ఎకరానికి 400 గ్రా. 2,4 డి. సోడియం సాల్ట్ 80% పొడి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- సిఫారసు మేరకు మాత్రమే ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. అధిక నత్రజని ఎరువులు వేసిన ఎడల పురుగులు మరియు తెగుళ్ళ ఉధృతి పెరగడానికి అవకాశం ఉన్నది. నాటిన తరువాత పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వేయరాదు. చిరుపొట్ట దశలో ఉన్న వరికి తప్పని సరిగా సిఫారసు చేసిన నత్రజనితో పాటూ సిఫారసు మేరకు మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ని (యం.ఒ.పి.) గింజ నాణ్యత, బరువు మరియు చీడ పీడలను తట్టుకునే శక్తి కొరకు తప్పక వాడవలెను.
- ఆలస్యంగా నాట్లు వేసిన మరియు నీళ్ళు నిల్వ వుండే పల్లపు భూములలో జింకుధాతు లోపం రావడానికి అవకాశం వున్నది. పంట మీద జింకు లోపం కనిపించినపుడు రెండు దఫాలుగా వారం వ్యవధిలో జింకు సల్ఫేట్ ను 2 గ్రా./ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.
- ఈ మాసంలో సామూహిక ఎలుకల యాజమాన్యం చేపట్టడం వలన ఎలుకల నుండి వరి పంటను కాపాడు కొనవచ్చును. ఎలుకల నివారణకు ఎలుక కన్నాలలో పొగబారించుకోవాలి. ఎకరానికి 20 చొప్పున ఎలుక బుట్టలు పెట్టుకోవాలి. బ్రోమోడయోలిన్ ఎర ఎలుకల మందు 10-15 గ్రా. ఒక కన్నానికి చొప్పున (96 పాళ్ళు నూకలు, 2 పాళ్ళు నూనె, 2 పాళ్ళు మందు) పొట్లాలుగా కట్టి కన్నానికి ఒకటి చొప్పున వేసుకోవాలి. ఈ మందును రైతులు సామూహికంగా 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పైరు చిరుపొట్ట దశకు వచ్చే లోపే ఎలుక కన్నాలలో పెట్టుకోవడం వలన ఎలుకలను సమర్ధవంతంగా అరికట్టవచ్చు.
- ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాలలో ఉల్లికోడు రావడానికి అవకాశం ఉన్నది. నివారణకు నాట్లు వేసిన 10-15 రోజులకు ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యురాన్ 3 జి. గుళికలు వేయాలి.
- సార్వాలో ముందుగా ఊడ్చిన పొలాలలో కాండం తొలుచు పురుగు మరియు ఆకుముడత ఆశించే అవకాశం వున్నది. కాబట్టి ఈ క్రింద తెలిపిన విధంగా సస్యరక్షణ చేపట్టుకోవాలి. కాండం తొలుచు పురుగు మరియు ఆకుముడత నివారణకు లీటరు నీటికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లేదా క్లోరాంట్ర

నిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. చిరు పొట్ట దశలో ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి. గుళికలు 8 కిలోలు లేదా కార్బోఫ్యురాన్ 3 జి. గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4 జి. గుళికలు 4 కిలోలు వేసుకోవాలి. దోమ ఎక్కువగా ఆశించే ప్రాంతాలో ఈ పురుగుల నివారణకు ప్రోఫెనోఫాస్, ట్రైజోఫాస్, క్లోరిపైరిఫాస్, మోనోక్రోటోఫాస్ మరియు సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు పిచికారి చేయరాదు.

- అధిక మరియు ఎడతెరిపి లేని వర్షాలు కురుసే ప్రాంతాలలో బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించే అవకాశం ఉన్నది. తెగులు నిర్ధారణ కోసం ఎండిన ఆకులను ముక్కలుగా కత్తిరించి మంచి నీటితో ఉన్న గాజుగ్లాసులో వేయాలి. అరగంట తరువాత నీటిని గమనించినట్లయితే, తెగులు ఆశించిన భాగాల నుండి బాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వల్ల నీటి గాఢత పెరగడం మరియు పసుపు రంగుకు మారడం జరుగుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటను బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్లుగా గుర్తించాలి. తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నిలిచిన నీటిని 2- 3 సార్లు మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీసివేసి కొత్త నీరు పెట్టడం వల్ల ఉధృతి తగ్గుతుంది. సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లువేసే సమయంలోనూ మరియు చిరుపొట్ట దశలోనూ వేయాలి. తెగులు సోకిన పొలానికి నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి.

వరి పంటపై పాము పొడ తెగులు ఆశిస్తే నివారణకు లీటరు నీటికి 2.0 మి.లీ. హెక్సాకొనజోల్ 5% లేదా 2.0 మి.లీ. వాలిడామైసిన్ 3 ఎల్. లేదా 1.0 మి.లీ. ప్రోపికొనజోల్ 25% ఇ.సి. లేదా 0.4 గ్రా. ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 25% + టెబుకొనజోల్ 50% డబ్ల్యు.జి. లేదా 1.5 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ 11% + టెబుకొనజోల్ 18.3% ఎస్.సి. లేదా 1.0 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ 25% ఎస్.సి. మందులలో ఏదో ఒక దాన్ని 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు మందులు మార్చి పిచికారి చేయాలి.

**డా॥ టి. శ్రీనివాస్,** ప్రధాన శాస్త్రవేత్త (వరి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
మారుటేరు - 534 122. చరవాణి : 93968 48380




**మ**న రాష్ట్రములో ప్రత్తి ప్రధానంగా శాఖీయ నుండి గూడ, పూత దశలలో వున్నది. విత్తిన 30-40 రోజుల దశలో గొర్రు మరియు గుంటకలతో అంతర కృషి ద్వారా కలుపు నివారణ చేపట్టాలి. పైరిథయోబ్యాక్ సోడియం 250 మి.లీ. మరియు క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసినట్లైతే, ప్రత్తి పంటకు ఎలాంటి నష్టం కలుగకుండా, గడ్డిజాతి మరియు వెడల్పాటి ఆకుల కలుపు మొక్కలను నివారించవచ్చును. కలుపు మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు, ఈ కలుపు మందులు సమర్ధవంతంగా పని చేస్తాయి. అంతర కృషి వీలుగాని పక్షములో మొండి జాతి కలుపు ఎక్కువగా వున్నట్లైతే ప్రత్తి మీద పడకుండా వుండటానికి గాను, హుడ్‌ను ఉపయోగించి ఎకరానికి 1లీటరు పారాక్వాట్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి కలుపు మొక్కల మీద మాత్రమే పిచికారీ చేయటం ద్వారా కలుపు నివారణ చేసుకోవచ్చు.

దుక్కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేసుకున్నట్లయితే, ఎకరానికి 150 కిలోల యూరియా, 50 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పంట విత్తిన 20 రోజుల నుండి నేలలో తేమ మరియు వర్షపాతాన్ని అనుసరించి 3 లేక 4 దఫాలుగా వేసుకోవాలి. దుక్కిలో భాస్వరపు ఎరువును వేయకపోతే పైన చెప్పిన దానితో పాటు ఎకరానికి ఒక బస్తా డై అమ్మోనియం ఫాస్ఫేట్‌ను పంట విత్తిన 20-30 రోజుల లోపు వేసుకోవాలి.

పంటలో సూక్ష్మధాతు లోపాలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలి. విత్తిన 45 మరియు 75 రోజులకు 10 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ 1 లీటరు నీటికి చొప్పున కలిపి రెండు సార్లు ద్రావణం పిచికారి చేయాలి.

జింకు ధాతువు లోపించినపుడు ఆకుల ఈనెలు ఆకుపచ్చగా ఉండి, ఈనెల మధ్య భాగము పసుపు పచ్చగా

మారుతుంది. 50 కిలోల జింక్ సల్ఫేట్‌ను ఎకరానికి చొప్పున చివరి దుక్కిలో వేసుకోవాలి. ప్రత్తి పంటలో జింక్ లోపాన్ని గుర్తించినట్లయితే, 2 గ్రా. జింక్ సల్ఫేట్‌ను 1 లీటరు నీటిలో కలిపి 5–7 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. బోరాన్ ధాతు లోపించినపుడు పూమొగ్గలు విచ్చుకొనవు. ఆకుల ఈనెలు ఒకే మాదిరిగా ఉండక కొంత భాగం పలుచగా, కొంతభాగం మందంగా మారుతుంది. 60 మరియు 90 రోజుల దశలో సోడియం టెట్రాబోరేట్ (బోరాక్స్) 1 లీటరు నీటికి 1.5 గ్రా. కలిపి పిచికారి చేయటం ద్వారా బోరాన్ లోపాన్ని నివారించగలము.

సమగ్ర సస్యరక్షణలో భాగంగా, తొలిదశలో ఆశించే రసం పీల్చు పురుగుల నివారణకు విత్తిన 30 మరియు 45 రోజులకు ఫ్లోనికామిడ్ 1:20 నిష్పత్తిలో నీటిలో కలుపుకొని, 60 రోజులకు ఇమిడాక్లోప్రిడ్ 1 పాలు, 20 పాళ్ళ నీటితో కలిపి కాండానికి పూత పూయడం ద్వారా ఖర్చు తగ్గటమే కాక పురుగు మందులు పిచికారి చేయనందున మిత్రపురుగుల సంతతి పెరిగి చీడపీడల అదుపుకు సహకరిస్తాయి. విత్తిన 45–50 రోజులకు వేపనూనె 1 లీటరు/ఎకరానికి లేదా వేప గింజల ద్రావణం 10% ను కానీ పంటపై పిచికారి చేయాలి. అదేవిధంగా ఎకరానికి 10 చొప్పున నీలి మరియు పసుపు రంగు జిగురు అట్టలను విత్తిన 40 రోజులకు అమర్చుకుని తామర పురుగులు మరియు తెల్లదోమను అదుపులో ఉంచవచ్చును.

ప్రత్తి పండించే రైతులందరూ, సామూహికంగా ఎకరానికి 4–6 చొప్పున విత్తిన 45 రోజులకు గులాబి రంగు పురుగు లింగాకర్షక బుట్టలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకొని తదనుగుణంగా, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఏర్పాటు చేసికొన్న లింగాకర్షక బుట్టలలో వరుసగా మూడు రోజులపాటు బుట్టకు 8 చొప్పున రెక్కల పురుగులను గమనించినట్లైతే లేదా 10 పువ్వులకు ఒక గ్రుడ్డి పువ్వును గమనించినట్లైతే గులాబి రంగు పురుగుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఎకరానికి ప్రొఫినోఫాస్ 50 ఇ.సి. 2.0 మి.లీ. లేదా థయోడికార్బ్ 75 డబ్ల్యూ.పి. 1.5 గ్రా. లేదా క్వినాల్‌ఫాస్ 25 ఇ.సి. 2.5 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి. 2.5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు లేక మూడు పర్యాయాలు మందులను మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి.

అధిక వర్షాల వలన, వేరుకుళ్ళు తెగులు కనిపించి నట్లయితే 3% కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణంతో ఆశించిన మొక్క చుట్టూ పోయాలి. ఆకు మచ్చల నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ యం. సుధారాణి,** ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
లాం, గుంటూరు – 522 034. చరవాణి : 99896 25207




మినుము, పెసర పైర్లను సెప్టెంబరు రెండవ పక్షంలో వేసుకోవచ్చు.

**అనువైన రకాలు :**

**మినుము :** ఎల్.బి.జి 904, టి.బి.జి. 129, ఎల్.బి.జి. 884, జి.బి.జి. 1, టి.బి.జి. 104, ఎల్.బి.జి. 752, ఎల్.బి.జి. 752, పి.యు. 31

**పెసర :** ఎల్.జి.జి. 630, ఎల్.జి.జి. 607, ఎల్.జి.జి. 574, ఎల్.జి.జి. 460, టి.యం. 96–2, ఐ.పి.యం. 2–14.

**విత్తన శుద్ధి :** ఒక కిలో విత్తనానికి 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్ లేదా మాంకోజెబ్ మందుతో విత్తనశుద్ధి చేసి తరువాత 5 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తన శుద్ధి చేసి విత్తితే తొలి దశలో ఆశించే రసం పీల్చే పురుగులు మరియు తెగుళ్ళ బారి నుండి కాపాడుకోవచ్చు. చివరగా విత్తే ముందు 200 గ్రా. రైజోబియం కల్చరును 10 కిలోల విత్తనానికి పట్టించి విత్తుకోవాలి.

**అంతరకృషి :** పెసర/మినుము పైరును 30 రోజుల వరకు కలుపు బారి నుండి రక్షించుకోవాలి. 20 రోజులు, 30 రోజుల దశలో గొర్రు / దంతి ద్వారా అంతరకృషి చేస్తే కలుపు నివారణతో బాటు తేమను గూడా నిలుపుకోవచ్చు. కలుపు అధికంగా ఉండే భూములలో అయితే విత్తిన వెంటనే పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.0–1.4 లీటర్లు చొప్పున విత్తిన వెంటనే గానీ మరసటి రోజు గానీ పిచికారి చేయాలి.

కంది పైరును నీటి వసతి ఉన్న ప్రాంతాలలో సెప్టెంబరు నెలలో సాగు చేసుకొనే అవకాశముంది.

**అనువైన కంది రకాలు :** ఎల్.ఆర్.జి. 105, ఎల్.ఆర్.జి. 52, ఎల్.ఆర్.జి. 133-33, టి.ఆర్.జి. 59, ఐ.సి.పి.ఎల్. 85063 (లక్ష్మి), ఐ.సి.పి. 8863 (మారుతి), ఐ.సి.పి.ఎల్. 87119 (ఆశ)

**విత్తే దూరం :** భూ స్వభావాన్ని బట్టి 60×20 సెం.మీ. / 90×20 సెం.మీ. / 120×20 సెం.మీ. దూరాన్ని మార్చుకొనవలెను.

**ఎరువులు :** హెక్టారుకు నత్రజని 20 కిలోలు, భాస్వరము 50 కిలోలు ఆఖరు దుక్కిలో వేసి కలియదున్నాలి. సూటి ఎరువులు అయినటువంటి యూరియా మరియు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వాడవలెను.

తొలకరిలో వేసిన మినుము, పెసర పైర్లు పూత మరియు కాయ దశలలో మరియు కంది శాఖీయ దశలలో ఉన్నాయి. మినుము, పెసర పైర్లకు ముఖ్యంగా క్రింది పురుగులు మరియు తెగుళ్ళు వచ్చే అవకాశం ఉంది.

**పల్లాకు తెగులు :** పల్లాకు తెగులు సోకిన మొక్కలను మరియు ఇతర కలుపు మొక్కలను పీకి నాశనము చేయవలెను. పైరుపై ఒక అడుగు ఎత్తులో పసుపు రంగు రేకులను గాని అట్టలను గానీ ఉంచి వాటి మీద ఆముదము గాని లేక గ్రీజు గానీ పూసినట్లయితే తెల్లదోమ ఉధృతిని తెలుసుకొనవచ్చును. తెల్లదోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా మెటాసిస్టాక్స్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పురుగుల ఉధృతిని బట్టి 7 నుంచి 10 రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.

**తలమాడు లేదా మొవ్వుకుళ్ళు :** వైరస్ వల్ల కలిగే తెగులు. దీని వ్యాప్తికి తామర పురుగులు దోహదపడతాయి. ముఖ్యంగా బెట్ట వాతావరణంలో ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులును నివారించాలంటే తామర పురుగులను నియంత్రించాలి. వీటి నివారణకు 1 గ్రా. ఎసిఫేట్ లేదా 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి ఉధృతిని బట్టి వారం రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి. ఒక అడుగు ఎత్తులో నీలి రంగు జిగురు అట్టలను ఎకరానికి 20 ఉంచినట్లైతే తామరపురుగుల ఉధృతిని తెలుసుకొనవచ్చును.

**మారుకా మచ్చల పురుగు :** పూత దశలో 'మారుక' అను గూడు పురుగు ఆశించే అవకాశము ఉంది. దీని నివారణకు లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేక నొవల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఫ్లుబెండిఎమైడ్ 0.2 మి.లీ. మందును పిచికారి చేస్తే పురుగును నివారించుకోవచ్చు. అవసరమయితే వారం రోజుల తరువాత మరల పిచికారి చేయాలి.

**డా॥ ఎమ్.వి. రమణ,** ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం. లాం, గుంటూరు.
చరవాణి నెం : 99896 25215

# చెఱకు



- డిసెంబరు - జనవరి మాసాలలో నాటిన మొక్కతోట మరియు కార్శి తోటల్లో ఈదురు గాలులకు, అధిక వర్షాలకు తోటలు పడిపోకుండా జడచుట్లు వేసుకోవాలి. ఎందుచేతననగా నిలబడిన తోటల కన్న పడిపోయిన చెరకు తోటలలో రసనాణ్యత మరియు దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. చెరకు తోట నరకడానికయ్యే ఖర్చు కూడా ఎక్కువవుతుంది.
- సెప్టెంబరులో కురిసే అధిక వర్షాల వలన కోస్తా ప్రాంతంలో చెరకు తోటలు ముంపుకు గురయ్యే అవకాశం ఉంది. ముంపుకు గురైన తోటల్లో మురుగు నీటిని వీలైనంత త్వరగా తీసివేయాలి. పిదప ఎకరాకు 25 కిలోలు యూరియా, 25 కిలోలు పొటాష్ ఎరువులను అదనపు మోతాదుగా వేయాలి.
- ఉత్తర కోస్తా జిల్లాలలో వర్షాధారంగా జులై మాసంలో నాటిన చెరకు తోటలకు భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు రెండవ దఫా "నత్రజని" (ఎకరానికి 35 కిలోల యూరియా) మొక్కల మొదళ్ళ దగ్గర చిన్న గోతులు తీసి వాటిలో వేసి కప్పాలి.
- లోతట్టు ప్రాంతాలలో మరియు నత్రజని వాడకము ఎక్కువగా ఉన్న చెరకు తోటలకు "దూదెకుల పురుగు" "పొలుసు పురుగు", "తెల్ల ఈగ" ఆశించే అవకాశం ఉంది. కావున చెఱకు తోటలను సకాలంలో పర్యవేక్షించి రసం పీల్చు

పురుగులు గమనించిన వెంటనే క్రింది ఆకులు రెలచి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 1.7 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

- ఈ మధ్యకాలంలో చెఱకులో ఎక్కువగా ఆశిస్తున్న మొజాయిక్, పసుపు ఆకు వంటి వైరస్ తెగుళ్ళను చెఱకు పంట తొలి దశలో గుర్తించడానికి తోటలను సకాలంలో పర్యవేక్షించాలి. వైరస్ తెగుళ్ళు పేనుబంక పురుగుల ద్వారా ఒక మొక్క నుండి ఇంకొక మొక్కకు వ్యాప్తి చెందుతాయి. కనుక తెగులును గమనించిన వెంటనే పేనుబంక పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 1.7 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. తెగులు సోకిన తోటల నుండి విత్తనమును వాడకూడదు. కార్శి కూడా చేయకూడదు.

**డా॥ సి.హెచ్. ముకుందరావు,**
ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు),
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, అనకాపల్లి.
చరవాణి : 99896 25216




- రాష్ట్రంలో ఇప్పటి వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది. నీటి వసతి ఉన్న చోట్ల వర్షాల కొరత వలన పంట నష్టపోకుండా పంట సున్నిత దశలలో నీటి తడులను తప్పక ఇవ్వాలి. బోదెలు కాలువలు పద్ధతిలో పంట వేసిన చోట, సాగునీటి లభ్యత తక్కువగా ఉంటే లేక జీవ తడులు ఇవ్వాల్సి వస్తే కాలువ విడచి కాలువకు నీరు పెట్టినచో ఎక్కువ విస్తీర్ణంలో పంటకు సాగు నీరు అందించవచ్చు.
- పంట ఏ దశలో ఉన్నప్పటికీ, అధిక వర్షం ఒకవేళ కురిసినట్లైతే పంట పొలంలో అధికంగా చేరిన నీరును తీసివేసుకునే ఏర్పాటు చేసుకోవాలి మరియు తెగుళ్ళు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా మాంకోజెబ్ పొడి మందును (2.5 గ్రా./లీ.) పిచికారి చేసుకోవాలి. పంట శాఖీయ దశ నుండి పుష్పించే దశలో (జల్లు విడిచే సమయం) ప్రత్యేకంగా పై చర్యలతో పాటు మురుగు నీరును తీసి వేసిన తరవాత పై పాటుగా యూరియా 20-25 కిలోలు మరియు పొటాష్ 15 కిలోలు ఎకరానికి (బూస్టర్ ఎరువుగా) వేసుకోవాలి.
- మోకాలి ఎత్తు దశ అనగా 30-35 రోజుల వయసున్న పైరులో అంతరకృషి జరిపి రెండవ దఫాగా 26 కిలోల నత్రజని ఇచ్చే ఎరువును పైపాటుగా వేసుకుని మట్టిని మొక్కల వేర్ల పైకి ఎగదోయాలి.
- 50-55 రోజుల వయస్సు నుండి పూత దశలో ఉన్న పైరుకు మూడవ దఫాగా 26 కిలోల నత్రజని ఇచ్చే ఎరువుతో పాటు 10 కిలోల పొటాష్ ఎరువును వేసుకోవాలి. పూత దశలో ఉన్న పైరు నీటి ఎద్దడి లేదా నీటి ముంపు పరిస్థితులకు గురి కాకుండా చూడాలి.
- కత్తెర పురుగు (ఫాల్ ఆర్మీ వార్మ్) ఉధృతి పంట శాఖీయ దశలో ఎక్కువగానే ఉంటుంది. గొంగళి పురుగులు ఆకులపై పత్ర హరితాన్ని గోకి తింటూ ఆకులపై రంధ్రాలను చేస్తుంది. ఇటువంటి రంధ్రాలు ఆకులపై నిలువుగా కనిపిస్తాయి. గొంగళి పురుగు పెరిగే కొద్దీ ఆకుల చివరల నుండి తింటూ ఆకు సుడులను మరియు కాండాన్ని తొలిచి రంధ్రాలను చేసి పంటను నష్టపరుస్తుంది. నివారణకు రసాయనిక మందులు వాడటం అత్యవసరం. ఎమామేక్టిన్ బెంజోయేట్ 5% ఎస్.జి. మందును 0.4 గ్రా. లేదా స్పైనోసాడ్ 45% ఎస్.సి. 0.3 మి.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5% ఎస్.సి. 0.4 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి ఆకుల సుడులు బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి. అవసరాన్ని బట్టి పై మందులను పది రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారి చేయాలి.
- ఆకు మాడు తెగులు ఆశించిన పైరుకు మాంకోజెబ్ ను 2.5 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పాము పొడ తెగులు ఆశించిన పైరులో నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన ఒకటి లేదా రెండు ఆకులను తీసివేయాలి. దీని నివారణకు ప్రోపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**డా॥ ఐ. సుధీర్ కుమార్,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం) వ్యవసాయ పరిశోధనా స్థానం,
పెద్దాపురం. చరవాణి : 99597 92568




**1. జొన్న :**

- జొన్న పంట పూత దశలో ఉన్నప్పుడు వర్షాలు పడి వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉంటే గింజ బూజు తెగులు లేదా బంక కారు తెగులు ఆశించడానికి వీలుంటుంది. వీటి నివారణకు ప్రొపికొనజోల్ మందును 0.5 మి.లీ./ లీటరు నీటికి కలిపి పూత దశలో మరియు గింజ ఏర్పడే దశలలో 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**2. సజ్జ :**

- జూన్ నెలలో విత్తిన సజ్జ పంట కోత దశలో ఉంటుంది. గింజ గట్టిపడినప్పుడు కంకులను కోసి బాగా ఎండబెట్టి గింజలను నిల్వ చేసుకోవాలి.
- ఆలస్యంగా విత్తిన పంటలో తేనె బంక తెగులు నివారణకు బ్లైటాక్స్ 50% డబ్ల్యు.పి. 2.5 గ్రా. మందును లీటరు నీటిలో కలిపి పూత దశ నుండి వారం వ్యవధితో మూడు దఫాలుగా పిచికారి చేయాలి.

**3. రాగి :**

- రాగి పంటలో అగ్గి తెగులు ఆశించవచ్చు. అగ్గి తెగులును నివారించడానికి (మొక్క ఆకులపై / కణుపుల పై వెన్నుపై మచ్చలు కనిపించినప్పుడు) లీటరు నీటికి 0.5 గ్రా. ట్రైసైక్లోజోల్ 75% డబ్ల్యు.పి. లేదా 1 గ్రా. కార్బెండెజిమ్ మందును లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలపై పిచికారి చేయాలి.

**4. కొర్ర :**

- కొర్ర పంటలో ఆకు మచ్చ తెగుళ్ళను నివారించడానికి లీటరు నీటికి 0.5 గ్రా. ట్రైసైక్లోజోల్ లేదా 1 గ్రా. కార్బెండెజిమ్ 75% డబ్ల్యు.పి. మందును లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలపై పిచికారి చేయాలి.
- కొర్ర పంటను ఖరీఫ్ కాలంలో సకాలంలో వర్షాలు లేనప్పుడు ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయవచ్చు. తక్కువ కాల పరిమితి గల సూర్యనంది మరియు గరుడ వంటి రకాలను ప్రత్యామ్నాయ పంటగా లేదా అంతర పంటగా సాగు చేయడానికి అనుకూలం.

**డా॥ యల్. మాధవీలత,**
ప్రధాన శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం)
వ్యవసాయ పరిశోధనా స్థానము, పెరుమాళ్ళపల్లె.
చరవాణి : 79819 29538




సాధారణంగా సెప్టెంబరు మాసంలో ఖరీఫ్ వర్షాధారిత లేదా నీటి వసతి క్రింద సాగులో ఉన్న వేరుశనగ పంటపై లద్దె పురుగు, పచ్చ దోమ, ఆకుముడత పురుగు, లేత ఆకుమచ్చ, ముదురు ఆకుమచ్చ మరియు త్రుప్పు తెగుళ్ళు ఎక్కువగా ఆశించే అవకాశము ఉంది.

- పిల్ల లద్దె పురుగులు పత్రహరితాన్ని గోకి తింటాయి. తరువాత దశలో ఆకులను తింటాయి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మొక్కలను మోళ్ళుగా తయారు చేస్తాయి.
- లద్దె పురుగుల నివారణకు వేప గింజల కషాయం 5 శాతం లేదా వేప సంబంధిత మందులను 1000 మి.లీ. ఒక ఎకరానికి పిచికారి చేయాలి. తొలి దశ పురుగు నివారణకు క్వినాల్ఫాస్ 400 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. ఎదిగిన లద్దె పురుగుల నివారణకి థయోడికార్బ్ 200 గ్రా. లేదా నొవల్యూరాన్ 200 మి.లీ. లేదా బాసిల్లస్ థూరెంజెన్సిస్ 200 గ్రా. ఒక ఎకరానికి 200 లీటర్ల నీళ్ళలో మందు కలిపిన ద్రావణాన్ని వినియోగించాలి.
- శనగ పచ్చ పురుగు నివారణకు కూడ పైన తెలిపిన సస్యరక్షణ పద్ధతులను పట్టించి నివారించుకోవచ్చు.
- ఆకుముడత పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పొలంను దూరం నుండి చూసినట్లయితే కాలిపోయినట్లు కనిపిస్తుంది. ఈ పురుగులు ఉనికి కొరకు పొలములో లింగాకర్షక బుట్టలు ఎకరానికి చొప్పున ఏర్పాటు చేసుకోవాలి. ఆకుముడత పురుగుపై 50 శాతము కన్నా ఎక్కువ పరాన్న జీవులు లేదా శిలీంద్రాలు ఆశించినట్లయితే ఎలాంటి పురుగు

మందులు వాడే అవసరం లేదు. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 400 మి.లీ. లేదా అసిఫేట్ 300 గ్రా. లేదా క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. ఒక ఎకరానికి 200 లీటర్ల మందు కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి.

- రసం పీల్చు పురుగులైన తామర పురుగులు మరియు పచ్చదోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 60 మి.లీ. కలిపి ఒక ఎకరానికి 200 లీటర్ల మందు కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి.

**తెగుళ్ళు – నివారణోపాయము :**

- ఈ సమయంలో లేత ఆకుమచ్చ, ముదురు ఆకుమచ్చ మరియు త్రుప్పు తెగుళ్ళు ఆశించే అవకాశము ఉంది. కావున పంటపై తెగుళ్ళ లక్షణాలు కనిపించిన వెంటనే మాంకోజెబ్ 400 గ్రా. మరియు కార్బండెజిమ్ 200 గ్రా. లేదా హెక్సాకొనజోల్ 5 యస్.సి. 400 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ 25.9 ఇ.సి. 200 మి.లీ. ఒక ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి.
- వేరుశనగలో బూజు తెగులు లేదా బుడమ తెగులు ఆశించే అవకాశము ఉంది. ఈ తెగులు ఉధృతిని నివారించుటకు ఆకుమచ్చ తెగుళ్ళను సకాలంలో నివారించుకోవాలి మరియు హెక్సాకొనజోల్ 400 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల మందు నీళ్ళు పిచికారి చేయాలి.
- వైరస్ తెగుళ్ళ నివారణకు అన్ని రకాలైన కలుపు మొక్కలను పూత దశకు రాక మునుపే తీసివేయాలి. పంటపై ఇమిడాక్లోప్రిడ్ 80 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల మందు నీళ్ళు పిచికారి చేయాలి.

**డా॥ ఎ. ప్రసన్న రాజేష్**
ప్రధాన శాస్త్రవేత్త (వేరుశనగ), వ్యవసాయ పరిశోధనా స్థానం, కదిరి. చరవాణి : 99896 25217




- ఖరీఫ్‌లో విత్తిన పంట సుమారు 25-50 రోజుల దశలో ఉంటుంది.
- విత్తిన 20-25 రోజుల తరువాత గొర్రుతో అంతరకృషి చేసి కలుపు నివారించవచ్చు.
- పంట 30 రోజులప్పుడు నత్రజనిని యూరియా రూపములో ఎకరానికి 13 కిలోల చొప్పున పైపాటుగా వేసుకోవాలి.
- పంట 50 రోజులప్పుడు నత్రజని ఎరువును యూరియా రూపములో మరో 13 కిలోలు వేసుకోవాలి.
- పైరు పూత దశలో బోరాక్స్ పొడిని 2 గ్రా. లీటరు నీటికి కలిపి ఆకర్షక పత్రాలు విచ్చుకొనే దశలో పిచికారి చేసినట్లయితే గింజ బాగా కడుతుంది.
- పైరుపై శనగ పచ్చ పురుగు ఉధృతి గమనించినట్లయితే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- అల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు గమనించినట్లైతే క్వింటాల్ (ఇప్రోడియోన్ 25% + కార్బండెజిమ్ 25%) లేదా సాఫ్ (కార్బండెజిమ్ 12% + మాంకోజెబ్ 63%) 2 గ్రా. లేదా ప్రొపికోనజోల్ 25% ఇ.సి. 1 మి.లీ. లేదా టాస్పా (డైఫెనకొనజోల్ 25% + ప్రొపికోనజోల్ 25%) 0.25 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ బి.వి. రవి ప్రకాష్ రెడ్డి,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం), చరవాణి : 99666 65434
**డా॥ కె. వెంకటరమణమ్మ,**
సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల తెగుళ్ళ శాస్త్రం) చరవాణి : 99088 29618
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల.




- జూన్ మాసంలో వేసిన ఆముదము పంట ప్రస్తుతము పూత దశలో ఉంటుంది. ఈ దశలో పై పాటుగా 6 కిలోల నత్రజని (13 కిలోలు యూరియా ఎకరానికి) పై పాటుగా వేసుకోవాలి.

మొక్కలు పుష్పించే దశలో నీటి ఎద్దడికి గురైతే మొక్కలు మగ పుష్పాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. కావున బెట్ట పరిస్థితులు ఎదురైనప్పుడు నీటి వసతి వున్నచోట ఒకటి లేదా రెండు తడులు (ఒక తడి అనగా 20 మి.మీ.) ఇచ్చినట్లయితే 15 నుండి 20 శాతం పంట దిగుబడి పెరిగే అవకాశం వుంది.

- జూలై మాసం లో వేసిన పంట ప్రస్తుతము శాఖీయ దశలో ఉంటుంది. ఈ దశ లో 6 కిలోల నత్రజనిని (13 కిలోలు యూరియా ఎకరానికి) పై పాటుగా వేసుకోవాలి .
- జులై చివరి వారం లేదా ఆగస్టు మొదటి వారంలో వేసిన ఆముదము పంటలో 15-20 రోజుల తర్వాత కుదురుకు ఒక మొక్క ఉండేలాగా ఒత్తు మొక్కలను పీకి వేయాలి. అదే సమయంలో మొలవని చోట కొత్త గింజను విత్తుకోవాలి.
- మొక్కలు మొలిచిన చోట 20 రోజులకు అంతర కృషితో పాటు తేమ సంరక్షణ సాలు వేసుకున్నట్లయితే తేమ మరియు మట్టి సంరక్షణ జరిగి పంట ఎదుగుదలకు మరియు బెట్ట పరిస్థితులను తట్టుకోవడానికి ఉపయోగపడుతుంది.
- పంట 25-30 రోజులు ఉన్నచోట కలుపు నివారణకు గుంటక లేదా గొర్రుతో అంతరకృషి చేసుకోవాలి.
- గాలిలో మరియు నేలలో తేమ అధికంగా ఉన్నప్పుడు లేదా నీరు నిలువ ఉండే ప్రదేశాలలో మొలక కుళ్ళు తెగులు సోకి ఆకులు వాడి కుళ్ళిపోయి మొక్కలు చనిపోయే అవకాశం వుంది. తీవ్రత ఎక్కువగా వున్నప్పుడు మెటలాక్సిల్ పొడి మందును 2 గ్రాముల చొప్పున ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలి.
- ఆముదము పంట విత్తిన 20-60 రోజుల మధ్య కాలంలో వడలు తెగులు / ఎండు తెగులు ఎక్కువగా రావడానికి ఆస్కారముంది. లేత దశలో తెగులు సోకినట్లయితే మొక్కలు వడలిపోయి, బీజ పత్రాలు రంగును కోల్పోయి, పాలిపోయి తర్వాత మొక్కలు చనిపోతాయి. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే కార్బండెజిమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర భూమిని తడపాలి. తెగులు సోకి చనిపోయిన మొక్కలను ఎప్పటికప్పుడు పొలం నుండి తొలగించి నాశనం చేయాలి. తెగులును తట్టుకునే వంగడాలైన పి.సి.హెచ్.-111, పి.సి.హెచ్.-222, డి.సి.హెచ్.-177, డి.సి.హెచ్.-519 లేదా ఐ.సి.హెచ్.-66 లాంటి రకాలను ఎన్నుకొని విత్తుకోవాలి.
- దాసరి లేదా నామాల పురుగు మరియు పొగాకు లద్దె పురుగు ఆముదపు పంటను ఆశించి ఎక్కువ నష్టాన్ని కలుగ జేసే అవకాశం ఉంది. నివారణకు వేప నూనె 5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా నొవల్యురాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- నీటి పారుదల వసతి ఉన్నప్పుడు ఆముదము పంటను సెప్టెంబర్ – అక్టోబర్ మాసాలలో విత్తుకోవచ్చును. తక్కువ పగటి ఉష్ణోగ్రతలు వున్నప్పుడు నీటి తడులను 12-15 రోజులకు ఒకసారి ఇవ్వాలి. నీటి ఎద్దడి గల ప్రాంతాలలో బిందు సేద్యము (డ్రిప్పు) లేదా తుంపర సేద్యము (స్ప్రింక్లర్లు) ద్వారా నీటి తడులు ఇవ్వాలి.
- బిందు సేద్యము ద్వారా నీటి తడి ఇచ్చేటప్పుడు ఇన్ లైన్ డ్రిప్పు కలిగిన లేటరల్ పైపును ప్రతి వరుసకు అమర్చుకోవాలి. 2.5 లీటర్ల డిశ్చార్జి గల డ్రిప్పులు వాడినచో సుమారుగా 4 గంటలు మరియు 4 లీటర్ల డిశ్చార్జి గల డ్రిప్పులు వాడినచో 2 గంటలు చొప్పున వారం నుండి పది రోజులకొకసారి నీటి తడులను ఇవ్వాలి.
- తుంపర సేద్యము ద్వారా నీటిని ఇచ్చేటప్పుడు వరుసల మధ్య 90 సెం.మీ. దూరం వున్నచో ప్రతి 16 వరుసలకు ఒక స్ప్రింక్లర్ లేదా రైజర్ పైపును అమర్చుకొని 20 మి.మీ. నీటిని 2 గంటల సమయంలో ఇవ్వటానికి వీలవుతుంది.
- హైబ్రిడ్ విత్తనోత్పత్తి చేయుటకు నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో సెప్టెంబర్ మొదటి పక్షం నుండి అక్టోబర్ మొదటి పక్షం వరకు విత్తుకోవడానికి అనుకూలము. సుమారుగా ఒక కిలో మీటరు చుట్టూ ఎటువంటి ఆముదము లేని ప్రదేశమును ఎన్నుకొని ఆడ, మగ మొక్కలను 3:1 లేదా 4:1 వరుసలలో విత్తుకోవాలి.

**డా॥ ఎ.వి.ఎస్. దుర్గాప్రసాద్,**
సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం),
చరవాణి : 99892 10879
**డా॥ వై. పవన్ కుమార్ రెడ్డి**, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం)
వ్యవసాయ పరిశోధనా స్థానం. అనంతపురము.
చరవాణి : 99669 70300




- వేరుశనగ, కంది, ప్రత్తి మరియు ఆముదము పంటలను వర్షాధారంగా సాగులో ఉన్నది. కంది, ప్రత్తి మరియు ఆముదము పంటల్లో నేల మరియు నీటి సంరక్షణ చాళ్ళు వాలుకు అడ్డంగా వరుసల మధ్యలో చిన్న ట్రాక్టర్‌తో లేదా ఎద్దులతో లాగే పెద్దమడకతో గాని వేసుకోవాలి. అంతర సేద్యము ద్వారా కలుపు నివారించుకోవాలి.
- వేరుశనగ పంటలో కీలక దశల్లో (పుష్పించే దశ, ఊడలు దిగే దశ మరియు కాయలు ఊరే దశ) బెట్ట పరిస్థితులు ఉన్న యెడల 20 మి.మీ. రక్షక తడి ఇవ్వాలి. నీటి కుంటల్లో కానీ లేదా కాలువలు లేదా గొట్టపు బావుల్లోని నీటిని ఉపయోగించుకొని కనీసము ఒక తడి నీరు పెట్టాలి.
- నల్ల రేగడి నేలల్లో ప్రత్తి మరియు కంది పంటల్లో నీటి ఎద్దడి ఉన్న యెడల రక్షక తడి 40 మి.మీ. రక్షక తడి ఇవ్వాలి.
- కంది పంటలో మొక్కకు మొక్కకు మధ్య 20 సెం.మీ. దూరం ఉండేటట్లు పాటించాలి. వత్తుగా ఉన్న మొక్కలను పలుచన చేయాలి. ఆలాగే ఆముదము పంటలో మొక్కకు మొక్కకు మధ్య 60 సెం.మీ. దూరం ఉండేటట్లు పాటించాలి.
- ఎర్ర నేలల్లో ఉలవ, సజ్జ, కొర్ర, జొన్న మరియు అనప పంటలను సాగు చేసుకోనవచ్చు.
- నల్ల రేగడి నేలల్లో 5 మీ. × 5 మీ. దూరంలో కంపార్టు మెంటల్ గట్లు ఏర్పరుచుకోవాలి. బండ్ ఫార్మర్ ద్వారా గట్లు ఏర్పరుచుకోవాలి. పడిన వర్షపు నీరు నేలలో ఇంకి బాగా సంరక్షించబడి అక్టోబర్‌లో విత్తు వేసే పప్పుశనగ పంటకు దోహదపడుతుంది.

**డా॥ బి. సహదేవ రెడ్డి**
ప్రధాన శాస్త్రవేత్త (మెట్ట వ్యవసాయం)
వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురము.
చరవాణి : 99896 25222




సెప్టెంబరు మాసంలో పశుగ్రాసంగా సాగు చేయదగిన పంటలలో ఉలవ పంట ప్రధానమైనది. తక్కువ కాల పరిమితిలో అధిక దిగుబడి, పోషక పదార్థాలు మరియు మాంసకృత్తులు కలిగిన ఉలవ పంటను పచ్చిమేతగాను, ఎండు మేతగాను వాడు కొనవచ్చును. అన్ని రకాల నేలలలో పండించ గలిగిన పంట. బీడు భూములలో, అతి తక్కువ నీటితో ఈ పంటను పండించుకొన వచ్చును. దీనిని ప్రధాన పంటగానూ లేదా ఇతర పంటలతో కలిపి అంతర పంటగాను విత్తుకోవచ్చును. ఉద్యాన పంటలైనటు వంటి మామిడి, చీనీ, జామ, నేరేడు మొదలగు తోటలలో ఉలవను అంతర పంటగా వేయుట వలన, ఇది గాలిలోని నత్రజనిని సంగ్రహించి నేలలో స్థిరీకరించును. దీని వలన ప్రధాన పంటలకు అవసరమైన నత్రజని మోతాదును తగ్గించు కొనవచ్చును. ఉలవను విత్తుకొనునప్పుడు 8 కిలోల విత్తనాన్ని ఒక ఎకరాకు వెదజల్లు పద్ధతిలో విత్తుకోవాలి. దుక్కిలో 8 కిలోల యూరియా, 50 కిలోల యస్.యస్.పి. మరియు 15 కిలోల యం.ఓ.పి. వేసుకోవాలి. ఉలవలో అధిక మాంసకృత్తులు ఉండుట వలన దీనికి ఎండుమేతగా తయారు చేసుకొని వేసవి కాలంలో అందించుటవలన పశుగ్రాస కొరతను కొంతవరకు అధికమించవచ్చును. మెట్ట ప్రాంత రైతులు గొర్రెలు, మేకలు కలిగి ఉన్నప్పుడు ఉలవలను ఆహారంగా అందించుట వలన అవి బాగా వృద్ధి చెందును. సెప్టెంబరు మాసంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలలో ముఖ్యమైనది వర్షాల బారిన పడకుండా పశుగ్రాస పంటలను కోతకోయడం. ముఖ్యంగా జులై మాసంలో విత్తుకొన్న పశుగ్రాస జొన్న లేదా మొక్కజొన్న పంటలు 50 శాతం పూత దశలో ఉండును. మొక్కజొన్న కండె పాలదశలో ఉన్నప్పుడు కోసుకోవాలి. ముఖ్యంగా ఈ పంటలను నీటిలో తడవకుండా కోత సమయంలో జాగ్రత్త వహించాలి, లేనిచో ఫంగస్ వృద్ధి చెంది మేతకు ఉపయోగపడవు. ఇలాంటి పంటను పాతర గడ్డి తయారీకి వినియోగించరాదు.

**డా॥ యస్. తిరుమల రెడ్డి,** శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి.
చరవాణి : 94920 73308

# ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము నుండి 2023 లో వివిధ పంటలలో రాష్ట్ర స్థాయిలో సాగుకు ఆమోదించిన నూతన రకాలు

డా॥ ఎల్. ప్రశాంతి, పరిశోధనా సంచాలకులు; డా॥ ఏ. సుబ్బరామి రెడ్డి, విస్తరణ సంచాలకులు;
డా॥ ఆర్. కృష్ణ నాయక్, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం); డా॥ జి.వి. సునీల్ కుమార్, సీనియర్ శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ జి. బిందు మాధవి, ప్రధాన శాస్త్రవేత్త (తెగుళ్ళ శాస్త్రం); డా॥ ఇ. అరుణ, సీనియర్ శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); డా॥ కె. గురవారెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం) మరియు డా॥ యం. సురేష్, సీనియర్ శాస్త్రవేత్త (తెగుళ్ళ శాస్త్రం);
పరిపాలనా కార్యాలయం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము, లాం, గుంటూరు.

మారుతున్న వాతావరణ పరిస్థితులను, చీడపీడలను, సాగు సమస్యలను పరిగణలోనికి తీసుకుని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు 2023 లో వివిధ పంటలలో రూపొందించిన ఈ క్రింది తొమ్మిది మేలైన రకాలను ఆంధ్రప్రదేశ్ లో వివిధ వ్యవసాయ వాతావరణ మండలాలలో పండించడానికి రాష్ట్ర పంట రకాల విడుదల అధీకృత ఉప సంఘం విడుదల చేయడానికి ఆమోదించడమైనది. పంట దిగుబడి, నాణ్యత మరియు చీడపీడలను తట్టుకునే శక్తి వంటి అంశాల ఆధారంగా మేలైన రకాలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో వాణిజ్య సరళిలో సాగుకు విడుదల చేయడానికి రాష్ట్ర పంట రకాల విడుదల అధీకృత ఉప సంఘం అధికారికంగా ప్రకటించడమైనది. వరి, మినుము, పెసర, వేరుశనగ మరియు బీడీ పొగాకు పంటల్లో రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిన నూతన రకాల యొక్క వివరాలు రాష్ట్ర రైతాంగం కోసం పొందు పరచడమైనది.

**2023 లో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వివిధ పంటలలో రాష్ట్ర స్థాయిలో విడుదల చేసిన నూతన రకాలు మరియు వాటి యొక్క వివరాలు :**

**1. పంట :** వరి

**రకము :** బి.పి.టి. 2841

**పంట కాలం :** 130-135 రోజులు

**సాగుకు అనువైన కాలం :** ఖరీఫ్

**దిగుబడి (ట./హె.) :** 5.5-6.0

**చీడపీడలను తట్టుకునే శక్తి :** అగ్గితెగులును, మెడవిరుపును మరియు దోమపోటును కొంత వరకు తట్టుకుంటుంది.

**ప్రత్యేక లక్షణములు :** చేనుపై పడి పోదు. బియ్యం పై పొర నలుపు రంగులో ఉంటుంది. పాలీఫినాల్స్, ఫ్లావనాయిడ్స్ మరియు యాంటి ఆక్సీడెంట్ యాక్టివిటీ ఎక్కువగా ఉండటం వలన దీన్ని ఆహారంగా తీసుకున్నప్పుడు మధుమేహం, కాన్సర్ మరియు గుండె సంబంధిత సమస్యలను ఎదుర్కొనే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీనితో పాటుగా ప్రోటీన్, జింక్, ఇనుము మరియు పీచు పదార్థాలు కూడా అధిక మోతాదులో ఉన్నట్లుగా నమోదు చేయబడినవి. అన్నానికి అనుకూలమైన రకం.

**అభివృద్ధి చేసిన పరిశోధనా స్థానం :** వ్యవసాయ పరిశోధనా స్థానం, బాపట్ల.

**2. పంట :** వరి

**రకము :** బి.పి.టి. 2846

**పంట కాలం :** 145-150 రోజులు

**సాగుకు అనువైన కాలం :** ఖరీఫ్

**దిగుబడి (ట./హె.) :** 6.5-7.0

**చీడపీడలను తట్టుకునే శక్తి :** అగ్గి తెగులును, మెడ విరుపును, ఆకు ముడతను, కొంతవరకు తట్టుకుంటుంది.

**ప్రత్యేక లక్షణములు :** చేనుపై పడి పోదు. మధ్యస్థ సన్నని ధాన్యం. అన్నానికి చాలా అనుకూలమైన రకం.

100 గింజల బరువు 13.5 గ్రా.

బియ్యం రికవరీ (65.2%)

కృష్ణా మరియు దక్షిణ మండలాల జిల్లాలకు సిఫార్సు చేయబడింది.

**అభివృద్ధి చేసిన పరిశోధనా స్థానం :** వ్యవసాయ పరిశోధనా స్థానం, బాపట్ల.

**3. పంట :** వరి
**రకము :** యం.టి.యు. 1271
**పంట కాలం :** 140 రోజులు
**సాగుకు అనువైన కాలం :** ఖరీఫ్
**దిగుబడి (ట./హె.) :** 6.5-7.0



**యం.టి.యు. 1271**

**చీడపీడలను తట్టుకునే శక్తి :** దోమ మరియు ఎండాకు తెగులును కొంత వరుకు తట్టుకుంటుంది.
**ప్రత్యేక లక్షణములు :** మధ్యస్థ సన్నం కలిగిన సన్న గింజ రకము. వెన్ను పొడుగ్గా ఉండి ఎక్కువ నిండు గింజలు కలిగి ఉంటుంది. కాండం ధృడంగా ఉండి చేనుపై పడిపోదు. బియ్యం పారదర్శకంగా ఉండి ఎక్కువ నిండు గింజల శాతం ఇస్తుంది.
**అభివృద్ధి చేసిన పరిశోధనా స్థానం :** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, మారుటేరు.

**4. పంట :** వరి
**రకము :** ఎన్.ఎల్.ఆర్. 3238
**పంట కాలం :** 120-125 రోజులు
**సాగుకు అనువైన కాలం :** ఎడగారు మరియు రబీ
**దిగుబడి (ట./హె.) :** 6.5-7.0



**ఎన్.ఎల్.ఆర్. 3238**

**చీడపీడలను తట్టుకునే శక్తి :** అగ్గి తెగులు, మెడ విరుపు తెగులును కొంత వరకు తట్టుకుంటుంది.
**ప్రత్యేక లక్షణములు :** కాండం ధృడంగా ఉండి, పైరు పై పడిపోని మధ్యస్థ గింజ కలిగిన వరి రకము.
పాలిష్ చేసిన బియ్యంలో జింకు మోతాదు 27.72 పి.పి.ఎమ్. గా కలిగి ఉంటుంది. బియ్యం పారదర్శకంగా ఉండి, గింజ నాణ్యత బాగుంటుంది.
**అభివృద్ధి చేసిన పరిశోధనా స్థానం :** వ్యవసాయ పరిశోధనా స్థానము, నెల్లూరు.

**5. పంట :** మినుము
**రకము :** టి.బి.జి - 129 (తిరుపతి మినుము 2)
**పంట కాలం :** 85 - 90 రోజులు
**సాగుకు అనువైన కాలం :** ఖరీఫ్, రబీ మరియు వరి మాగాణులు
**దిగుబడి (ట./హె.) :** 1.6-1.8



**టి.బి.జి - 129**

**చీడపీడలను తట్టుకునే శక్తి :** పల్లాకు తెగులును తట్టుకుంటుంది.
**ప్రత్యేక లక్షణములు :** గింజలు లావుగా ఉండి మెరుస్తూ వుంటాయి.
**అభివృద్ధి చేసిన పరిశోధనా స్థానం :** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్తానము, తిరుపతి.

**6. పంట :** మినుము
**రకము :** ఎల్.బి.జి. 904
**పంట కాలం :** 85 - 90 రోజులు
**సాగుకు అనువైన కాలం :** ఖరీఫ్, రబీ, వరి మాగాణులు మరియు వేసవి
**దిగుబడి (ట./హె.) :** 2.2-2.5
**చీడపీడలను తట్టుకునే శక్తి :** పూర్తిగా పల్లాకు తెగులును మరియు కొంత వరకు తల మాడు తట్టుకొనే రకము.
**ప్రత్యేక లక్షణములు :** అధిక దిగుబడి నిచ్చే రకము. గింజలు మధ్యస్థ లావు కలిగి మెరుస్తుంటాయి

**అభివృద్ధి చేసిన పరిశోధనా స్థానం :** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, గుంటూరు.

**7. పంట :** పెసర

**రకము :** ఎల్.జి.జి. 630

**పంట కాలం :** 65-70 రోజులు

**సాగుకు అనువైన కాలం :** ఖరీఫ్, రబీ, వరి మాగాణులు మరియు వేసవి

**దిగుబడి (ట./హె.) :** 1.6-1.8



**ఎల్.జి.జి. 630**

**చీడపీడలను తట్టుకునే శక్తి :** పూర్తిగా పల్లాకు తెగులును తట్టుకొనే రకము.

**ప్రత్యేక లక్షణములు :** ఒకేసారి కోత కోయుటకు అనువైన రకము. గింజలు మధ్యస్థ లావు కలిగి మెరుస్తుంటాయి.

**అభివృద్ధి చేసిన పరిశోధనా స్థానం :** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, గుంటూరు.

**8. పంట :** వేరుశనగ

**రకము :** టి.సి.జి.ఎస్.-1522

**పంట కాలం :** 100-103 (ఖరీఫ్); 103-106 (రబీ)

**సాగుకు అనువైన కాలం :** ఖరీఫ్, రబీ

**దిగుబడి (ట./హె.) :** 3.3 (ఖరీఫ్), 4.0 (రబీ)

**చీడపీడలను తట్టుకునే శక్తి :** ఆకు మచ్చ మరియు తుప్పు తెగుళ్ళను కొంత వరకు తట్టుకుంటుంది.

**ప్రత్యేక లక్షణములు :** కాయ నుండి పప్పు దిగుబడి: 75-76 శాతం. నూనె శాతం:48.5

100 గింజల బరువు :45-47 గ్రా.

అధిక నీటి వినియోగ సామర్థ్యం.

గింజలు లేత గులాబీ రంగులో ఉంటాయి.

కాయలన్నీ ఒకేసారి పక్వమునకు వచ్చును.



**టి.సి.జి.ఎస్.-1522**

**అభివృద్ధి చేసిన పరిశోధనా స్థానం :** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి.

**9. పంట :** బీడీ పొగాకు

**రకము :** ఎ.బి.డి. 132

**పంట కాలం :** 195-210 రోజులు

**సాగుకు అనువైన కాలం :** ఖరీఫ్

**దిగుబడి (ట./హె.) :** 2.22

**చీడపీడలను తట్టుకునే శక్తి :** సాధారణంగా పొలంలో పరిశీలించినప్పుడు స్పోడాప్టెరా లిటురా, పేనుబంక, పిండినల్లి మరియు మాగుడు తెగులు (డాంపింగ్ ఆఫ్), బ్లాక్ షాంక్, టుబాకో మొజాయిక్ మరియు లీఫ్ కర్ల్ వైరస్‌లను మధ్యస్థంగా తట్టుకుంటుంది. ఒరోబాంకిను కూడా మధ్యస్థంగా తట్టుకుంటుంది.

**ప్రత్యేక లక్షణములు :** ఈ రకం పొగలో తక్కువ హాని కారకాల శాతాన్ని కలిగి ఉంది. అవి 32.95 - 34.09% తార్, 1.84 - 3.55% నికోటిన్ మరియు 16.75 - 19.42% కార్బన్ మోనాక్సైడ్‌ను కలిగి వాడుక రకం నంద్యాల పొగాకు 1 తో పోల్చినప్పుడు 34.40 - 41.84% తార్, 1.14 - 4.22% నికోటిన్ మరియు 20.58 - 22.05% కార్బన్‌మోనాక్సైడ్ తక్కువగా ఉన్నాయి మరియు 31.15% విత్తన నూనెను కలిగి ఉంది. కిలో ఆకు ధర రూ. 85-90 పలికింది.

ఆకు కోత వరకు పచ్చగా వుండి మరియు అధిక వర్షపాత పరిస్థితులను తట్టుకుంటుంది

**అభివృద్ధి చేసిన పరిశోధనా స్థానం :** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానము, నంద్యాల.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : **94402 20038**

# వరిలో ముఖ్యమైన నాణ్యతా లక్షణములు

డా॥ సి.హెచ్. శ్రీలక్ష్మీ, సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం); డా॥ యు. వినీత, సీనియర్ శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); డా॥ షేక్. సమీర, శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం); డా॥ ఐ. పరమశివ, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) మరియు డా॥ పి. మధుసుధన్, సీనియర్ శాస్త్రవేత్త (తెగుళ్ళ శాస్త్రం); వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరు.

మన దేశంలో వరి ప్రధాన ఆహార పంట. వరి కేవలం ఆహారాన్ని అందించడమే కాదు మన జీవన శైలిలో ఒక అంతర్భాగంగా ఉండి ఎంతో మందికి జీవనోపాధిని కల్పించే సాధనంగా కూడా ఉంది. హరిత విప్లవానంతరం అధిక దిగుబడినిచ్చే వరి వంగడాల రూపకల్పనలో శాస్త్రవేత్తలు సఫలీకృతం కావడం వలననే మన దేశంలో వరి పంటకు సంబంధించి మనం స్వయం సమృద్ధిని సాధించామనే చెప్పుకోవాలి. తరువాతి తరంలో చీడపీడలను తట్టుకునే విధంగా వరి వంగడాల రూపకల్పన జరిగింది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా నాణ్యత గల వరి / బియ్యానికి అధిక ప్రాధాన్యత ఏర్పడింది. విభిన్న సంస్కృతులకు నిలయమైన మన భారతదేశంలో నాణ్యత అంటే ఫలానా అని నిర్వచించడం కష్టమైన పని. ఒక్కో ప్రాంత ప్రజలు వారి అభిరుచిని అనుసరించి నాణ్యతను వివిధ రకాలుగా అభివర్ణిస్తారు. అంతేకాక ప్రభుత్వం వారు రైతుల నుండి సేకరించేటప్పుడు కూడా ఆయా రకానికి సంబంధించిన నిర్దిష్టమైన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటేనే రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

వరిలో గింజ నాణ్యతను ప్రధానంగా భౌతిక నాణ్యత, రసాయనిక నాణ్యత మరియు పోషక నాణ్యతలుగా విభజించవచ్చును.

### భౌతిక నాణ్యతా లక్షణములు :

వరిలో గింజ నాణ్యత, (బాహ్య నాణ్యత) అనగా గింజ పొడవు, గింజ వెడల్పు, గింజ పొడవు - వెడల్పుల నిష్పత్తి (గింజ ఆకారము), గింజ రంగు, నిండు గింజల శాతము, నూక శాతము, గింజలోని పొట్ట తెలుపు, గింజ పగుళ్ళు లాంటివి బాహ్య లక్షణాలన్నీ భౌతిక నాణ్యతా లక్షణాలుగా చెప్పవచ్చును. వరిలో గింజల వర్గీకరణ ఈక్రింది పట్టికలో రూపొందించడం జరిగింది.

| సం. | గింజ రకము | పొడవు (మి.మీ.) | పొడవు / వెడల్పుల నిష్పత్తి |
|---|---|---|---|
| 1. | పొడవు - సన్నం | > 6 | 3.0 |
| 2. | పొట్టి - సన్నం | < 6 | 3.0 |
| 3. | మధ్యస్థ - సన్నం | < 6 | 2.5-3.0 |
| 4. | పొడవు - లావు | > 6 | < 3.0 |
| 5. | పొట్టి - లావు | < 6 | < 3.0 |

సాధారణంగా మర పట్టిన తర్వాత 100 కిలోల ధాన్యం నుండి 60 కిలోల వరకు బియ్యం ముక్కలవకుండా వస్తాయి. ఇకపోతే రంగు పారదర్శకంగా ఉన్నట్లయితే వినియోగదారులు అధికంగా ఇష్టపడతారు. అలాకాకుండా గింజ మధ్య భాగంలో తెల్లగా ఉంటే దానిని పొట్ట తెలుపు అనీ, అలాంటి గింజలలో విరుగుడు శాతం అధికం ఉంటుంది. ఈ పొట్ట తెలుపు గింజలో 10% వరకు ఉంటే తక్కువగానూ, 10-20% వరకు ఉంటే మధ్యస్థంగానూ, 20% కన్నా ఎక్కువగా ఉంటే అధికంగానూ ఉన్నట్లు చెప్పవచ్చు. పొడవు, సన్నముగా గల గింజలు ఎక్కువగా బాసుమతి రకానికి చెందినవి. వీటికి ఎగుమతి అవకాశాలు ఎక్కువ. తద్వారా మన దేశానికి విదేశీ మారకద్రవ్యాన్ని అర్జించుచున్నాయి. మధ్యస్థ సన్న రకాలకు దేశీయ మార్కెట్లో అధిక గిరాకీ ఉంటుంది. పొడవు - లావు రకాలకు కూడా ఎగుమతి అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. పొట్టి లావు రకాలన్నీ ఉప్పుడు బియ్యం తయారీకి ఎక్కువగా వాడడం జరుగుతుంది.

### రసాయనిక లక్షణాలు :

రసాయనిక లక్షణాలను అన్నం స్వభావము మరియు రసాయన లక్షణాలుగా పరిగణించవచ్చు.

అన్నం స్వభావాన్ని నిర్ధారించే పరీక్షలలో ముఖ్యమైనవి :

- నీటిని పీల్చే స్వభావము – సాధారణంగా అన్నం ఉడక బెట్టుటకు అధిక నీరు వినియోగించు రకాలను మేలైనవిగా చెప్పుకోవచ్చు.
- అన్నం వదిగే శక్తి వరి రకము యొక్క జన్యువులపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా గింజ సాగే లక్షణం ఎక్కువగా ఉన్న రకాలను వండినప్పుడు అన్నం కూడా ఎక్కువగా పెరుగుతుంది. అంతేకాక ధాన్యాన్ని 3-4 నెలలు నిల్వ ఉంచిన తర్వాత కనుక వాడినట్లయితే అన్నం ఎక్కువగా ఒదుగుతుంది. నిల్వ ఉన్న బియ్యం యొక్క అన్నం ఎక్కువవడమే కాకుండా అన్నం మెతుకులు అతుక్కోవు.

సాధారణంగా బియ్యాన్ని ఉడికించినప్పుడు బియ్యం లోపల ఉన్న స్టార్చ్ రేణువులు నీటిని గ్రహించి ఉబ్బుతాయి. ఈ ప్రక్రియలో బియ్యం గింజ పొడవుగానూ మరియు అడ్డంగా సాగుతుంది. సాధారణంగా నిలువుగా సాగే గుణం గల రకాలను ఎక్కువ మంది ఇష్టపడతారు. గింజ సాగే నిష్పత్తి అనగా వండిన తర్వాత బియ్యపు గింజ పొడవు మరియు వండుటకు ముందు బియ్యపు గింజలు పొడవు నిష్పత్తి, ఈ నిష్పత్తి ఎక్కువగా ఉన్న రకాలను నాణ్యతాపరంగా ముఖ్యమైనవిగా భావిస్తారు.

వరి గింజలలో అన్నానికి అనువైన నాణ్యతా లక్షణాలన్నీ ప్రధానంగా గింజలోని అమైలోజ్ శాతముపై ఆధారపడి ఉంటాయి. అమైలోజ్ శాతాన్ని బట్టి వరి రకాలను వ్యాక్సీ మరియు నాన్-వ్యాక్సీ రకాలుగా విభజించారు. నాన్ వ్యాక్సీ రకాలలో అమైలోజ్ ఉండదు. వ్యాక్సీ రకాలను 3 భాగాలుగా విభజించారు.

$<$ 20% = తక్కువ

20-25% = మధ్యస్థం

$>$ 25% = ఎక్కువ

మధ్యస్థ అమైలోజ్ ఉన్న రకాలు వండిన తర్వాత అన్నం నాణ్యతను కలిగిఉంటాయి. ఒకవేళ తక్కువగా అమైలోజ్ ఉన్నట్లయితే అన్నం బాగా ముద్దగానూ, అధిక అమైలోజ్ ఉన్నట్లయితే అన్నం బాగా బిరుసుగానూ మారుతుంది.

**జిలాటినైజేషన్ ఉష్ణోగ్రత :**

సాంకేతిక పరిభాషలో అన్నం ఉడకటానికి కావలసిన ఉష్ణోగ్రతను జిలాటినైజేషన్ ఉష్ణోగ్రత అని అంటారు. సాధారణంగా 70-74$^0$ సెంటీగ్రేడ్ వద్ద అన్నం ఉడుకుతుంది. అధిక ఉష్ణోగ్రత వద్ద ఎక్కువ సేపు ఉంచినట్లయితే అన్నం ముద్దగానూ తయారవుతుంది.

**జెల్ కన్సిస్టెన్సీ :** వండిన తర్వాత అన్నం స్వభావాన్ని జెల్ కన్సిస్టెన్సీ పరీక్ష ద్వారా నిర్ధారిస్తారు. జెల్ కన్సిస్టెన్సీ విలువ తక్కువగా ఉన్న రకాలు గట్టిగా ఉన్న స్వభావాన్ని కలిగి ఉంటాయి. అధికంగా ఉన్న రకాలు చాలా మృదువుగా ఉంటాయి. కావున మధ్యస్థ విలువ (40-60 మి.మీ.) విలువ గల రకాలు మంచి నాణ్యమైనవిగా గుర్తించవచ్చును.

**పోషక నాణ్యతా లక్షణాలు :**

బియ్యం గింజలో శరీరానికి కావలసిన విటమిన్లు, ప్రోటీన్లు, సూక్ష్మపోషకాలు మొదలైనవన్నీ కూడా ఎక్కువ భాగం పై పొరల్లో ఆవరించి ఉంటాయి. మనం పాలిష్ చేసినప్పుడు దాదాపుగా పైవన్నీ తవుదులోకి పోయి మనకు బియ్యం రూపంలో కేవలం కార్బోహైడ్రేట్లు మాత్రమే మిగులుతాయి. ఒకవేళ పాలిష్ చేయకుండా బియ్యాన్ని మర మాత్రమే పట్టి ఉంచితే నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. కావున పాలిష్ కొంత తక్కువ చేసుకుంటే మంచిది.


వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరు వారు రూపొందించిన ఎన్.ఎల్.ఆర్. 3238 అను రకం అన్నం నాణ్యతాపరంగా బాగుండి, 120 రోజుల కాలపరిమితి గలిగి గింజ మధ్యస్థంగా ఉండి, పైరుపై పడిపోకుండా ఉండి, సంవత్సరంలో అన్ని కాలాలకు సాగు చేసుకోడానికి అనువుగా ఉండి పైపెచ్చు మరపట్టి, పాలిష్ చేసిన తర్వాత కూడా ఈ రకం బియ్యంలో 24 పి.పి.యం. వరకు జింకు లభ్యమవుతుంది. సాధారణ రకాలలో జింకు లభ్యత 14-16 పి.పి.యం. గా ఉంటుంది.

ప్రస్తుత పరిస్థితులలో గ్లైసిమిక్ ఇండెక్స్ అను పదం చాలా చోట్ల వినిపిస్తూ ఉంది. గ్లైసెమిక్ ఇండెక్స్ అంటే మనం తీసుకున్న ఆహారం చక్కెరగా మారి రక్తంలోనికి కలవడానికి తీసుకునే సమయం. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న రకాలు ఎక్కువ సమయాన్ని తీసుకుంటాయి. మధ్యస్థ విలువ ఉన్న రకాలు ఆహారంగా తీసుకుంటే మంచిది.

**మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 98855 27227**

# వరి అనంతరం జొన్న సాగు ఉత్పత్తిలో సాంకేతికత

డా॥ డి. సేవా నాయక్, శాస్త్రవేత్త (మొక్కల శరీర ధర్మశాస్త్రం); డా॥ బి. సుబ్బారాయుడు, శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం); డా॥ ఎ. శ్రీనివాస్, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం); ఐ.సి.ఎ.ఆర్. భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ, రాజేంద్ర నగర్, హైదరాబాద్;



ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా డెల్టా ప్రాంతంలోని రైతులు గతంలో వరి తరువాత మినుము, పెసర మరియు మొక్కజొన్న పంటలను సాగు చేసే వారు, అయితే ఈ మధ్యకాలంలో ఎక్కువగా వాతావరణంలో మార్పులు రావటం వలన మినుము మరియు పెసర పంటలకు పసుపు మొజాయిక్ వైరస్ మరియు కస్కుట పరాన్న జీవి అనే కలుపు మొక్క బారిన పడుట వలన ఈ రెండు పంటల సాగు విస్తీర్ణము బాగా తగ్గింది. మొక్కజొన్న పంటకు ఎక్కువ మోతాదు నీటి పారుదల మరియు ఎక్కువ ఎరువులు అవసరం అవుతుంది. జొన్నలో ఉన్న పోషకాలతో పోల్చుకుంటే మొక్కజొన్నలో తక్కువ ఉంటాయి. కావున రైతులు జొన్నను వరి అనంతరం పంటగా సాగు చేసి అధిక లాభం పొందగలరని మనవి చేస్తున్నాము.

**సాగుకు సిఫారసు చేయబడిన విధానాలు :**

వరి సాగు అనంతరం జొన్న సాగుకు ప్రత్యేకమైన జొన్న రకాలు మరియు సంకర (హైబ్రీడ్స్) రకాలు అయితే లేవు కాని ఖరీఫ్‌లో సాగు చేసే హైబ్రీడ్స్ రకాలను సాగు చేసినట్లు అయితే అధిక దిగుబడిని పొందవచ్చును.

**1. రకాలు :** సి.ఎస్.హెచ్. 16 మరియు సి.ఎస్.హెచ్. 14.

**అధిక దిగుబడిని ఇచ్చే సంకరాలు :**

**ఎ) సి.ఎస్.హెచ్. 16**

పంట వ్యవధి : 110 రోజులు

మొక్క పెరుగుదల రకం : మధ్యస్థ ఎత్తు (2 మీ.)

గింజ దిగుబడి : 8.0 టన్నులు / హెక్టారుకు

పశుగ్రాసం దిగుబడి : 11.0 టన్నులు / హెక్టారుకు

**బి) సి.ఎస్.హెచ్. 14**

పంట వ్యవధి : 105 రోజులు

మొక్క పెరుగుదల రకం : మధ్యస్థ ఎత్తు (2 మీ.)

గింజ దిగుబడి : 3.0 నుండి 4.0 టన్నులు / హెక్టారుకు

పశుగ్రాసం దిగుబడి : 8.7 టన్నులు / హెక్టారుకు

**2. సాగు చేయు విధానము :** ఖరీఫ్‌లో లేటుగా వరి సాగు చేసిన పంటను కోసిన తరువాత అనగా డిసెంబరు రెండవ వారం లేదా జనవరి మొదటి వారంలో సాగు చేసుకోవాలి. వరి పంట కోసిన తరువాత నేలను దున్నటం అవసరం అయితే లేదు కాని చిన్న చిన్న రంధ్రాలు / గుంటలను 4-6 సెం.మీ. లోతు ఉండేటట్లు రంధ్రాలు చేసుకోవాలి.

**3. విత్తన మోతాదు :** హెక్టారుకు 8-10 కిలోల విత్తనాలు అయితే సరిపోతుంది.

**4. విత్తన శుద్ధి :** విత్తనాన్ని 14 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ (గౌచ్) + 2 గ్రా. కార్బండెజిమ్ (బావిస్టిన్) తో ఒక కిలో విత్తనాన్ని శుద్ధి చేయాలి.

**5. విత్తే అంతరం :** వరుసల మధ్య దూరం 45 సెం.మీ.; వరుసలో ఒక మొక్క నుండి ఇంకో మొక్కకు మధ్య దూరం

10 నుండి 15 సెం.మీ. ఉండేటట్లు విత్తనాలను విత్తుకోవాలి.

**6. ఎరువుల యాజమాన్యం :** విత్తనాలు వేసే సమయంలో ఎటువంటి ఎరువును వేయవలసిన అవసరము అయితే లేదు కాని విత్తనాలు మొలసిన 30 మరియు 60 (పూత పూసే సమయంలో) రోజుల తరువాత రెండు దఫాలుగా ఎరువులను వేసుకోవాలి.

మొదటి దఫాగా : నత్రజని 40 కిలోలు / హెక్టారు.
భాస్వరం 40 కిలోలు / హెక్టారు
పొటాష్ 40 కిలోలు / హెక్టారు
రెండవ దఫాగా : నత్రజని 40 కిలోలు / హెక్టారు

**7. కలుపు మొక్కల నివారణ :** వరి అనంతరం జొన్న సాగులో ఎకైనోక్లోవ అనే కలుపు మొక్క వచ్చి పంట దిగుబడి నష్టాన్ని కలిగిస్తుంది.

**ఎ) విత్తనం విత్తక ముందు :** పంట సాగు ముందు ఆవిర్భావం అయ్యే కలుపు మొక్కలను పారక్వాట్ + అట్రాజిన్ 1.0+0.5 కిలోలు / హెక్టారు మోతాదులలో వాడి ఈ కలుపు మొక్కలను నివారించవచ్చును.

**బి) విత్తనం విత్తిన తరువాత :** విత్తనం విత్తిన తరువాత వచ్చే కలుపు మొక్కలను పారాక్వాట్ పొడి ఈ రకమైన కలుపు మొక్కను నివారించవచ్చును.

**8. కీటకాలు వాటి నివారణ చర్యలు :**

**ఎ) మొవ్వు చంపే ఈగ :** విత్తనాలు నాటిన ఒక నెల లోపు ఈ మొవ్వు చంపే ఈగ వ్యాపిస్తుంది. ఇ ఈగ లార్వాలు పెరుగుతున్న మొవ్వును కత్తిరించటం వలన మొవ్వు ఆకులు ఎండిపోవటం జరుగుతుంది. దీనిని డెడ్ హార్ట్ అని కూడా పిలుస్తారు.

నివారణ చర్యలు : విత్తనాలు వేసే సమయంలో కార్బోఫ్యూరాన్ 3 జి. గుళికలను 20 కిలోలు / హెక్టారుకు వాడటం వలన లేదా విత్తన శుద్ధి చేయడం వలన ఈగను అరికట్టవచ్చును.

**బి) కత్తెర పురుగు :** ఈ పురుగు లార్వా దశలో ఆకులను తిని పంటకు నష్టాన్ని కలిగిస్తుంది.

నివారణ చర్యలు : స్పైనెటోరం 11.7% ఎస్.సి 0.5 మి.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 ఎస్.సి. 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 12.6% + లాంబ్డాసైహాలోమెత్రిన్ 9.5% 2 సి. 0.25 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**వ్యాధులు మరియు నివారణ చర్యలు :**

**ఎ) చారల వైరస్ :** ఈ వ్యాధి సోకిన ఆకు యొక్క ఈనెల మధ్య విస్తీర్ణమైన చారలు / పట్టీలు ఏర్పడతాయి.

ఈ వ్యాధి ప్రభావం వలన మొక్క పెరుగుదల ఉండదు మరియు మొక్కలు మరగుజ్జుగా మారి జొన్న కంకులు ఏర్పడకుండానే చనిపోతాయి.

**నివారణ చర్యలు :** ఈ వ్యాధిని విత్తన శుద్ధి చేయటం వలన అరికట్టవచ్చును.

**నీటి యాజమాన్యం :** వరి అనంతరం జొన్న సాగుకు రెండు నీటి తడులు ఉంటే సరిపోతుంది. 30 మరియు 60 రోజుల (పూత పూసే సమయంలో) తరువాత మొదటి మరియు రెండవ నీటి తడి పెట్టుకోవాలి.

**పంట కోత :** ఏది పక్వమైన పంటను అనగా విత్తిన 100-110 రోజులకు పంట కోసుకోవాలి.

**గింజ దిగుబడి :** 5.0 నుండి 6.0 టన్నులు / హెక్టారుకు జొన్న గింజలు పొందవచ్చును.

**ధాన్యం నిలువ చేయటం :** నూర్చిన ధాన్యాన్ని ఎండలో ఎండ పెట్టుకోవాలి, ధాన్యాన్ని నిలువ చేయు సమయంలో గింజలోని తేమ శాతం 10-12% ఉండేటట్లు ఎండ బెట్టుకొని గోనె సంచులలో నిల్వ చేసుకోవాలి.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 94545 32027

రైతు సేవలో వివిధ ఆధునిక యాప్‌లు
అంగ్రూ అగ్రి, కృషి విజ్ఞాన్, ఆంగ్రూ చెరకు సాగు, వ్యవసాయ వాతావరణ సూచనలు, పశుపోషణ్, ఫర్టిలైజర్ కాలిక్యులేటర్, ఆర్.బి.కె. ఛానల్
ఈ యాప్‌లు వినియోగించుటకు స్మార్ట్ ఫోన్ కలిగిన వారు గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చు

# తొలి దశలో కంది పంటను ఆశించే పురుగులు మరియు తెగుళ్ళ యాజమాన్యం

డా॥ పి. రాధిక, ప్రధాన శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ జి.డి. ఉమాదేవి, సహ పరిశోధకురాలు, (సేద్య శాస్త్రం); డా॥ కె. అశోక్ కుమార్, సీనియర్ శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); కె.వి.యస్. సుధీర్, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); డా॥ బి. సహదేవరెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త & అధిపతి, వ్యవసాయ పరిశోధన స్థానం, అనంతపురం.

మన రాష్ట్రంలో పండించే అపరాల పంటలలో కంది ప్రధానమైనది. ఈ పంట బెట్ట పరిస్థితుల్లోను, తేలిక పాటి నేలల్లో వర్షాధారంగా సాగు చేయడానికి అనువైనది. కంది మన రాష్ట్రంలో అధిక విస్తీర్ణంలో సాగు చేయబడుచునప్పటికీ, సరాసరి దిగుబడి మాత్రం ఎకరాకు 1.5-2.0 క్వింటాళ్ళు మాత్రమే వున్నది. దీనికీ ముఖ్య కారణాలు కంది పంటను ఎక్కువ శాతం వర్షాధారంగా తేలిక పాటి నేల్లలో చిన్న మరియు సన్నకారు రైతులు తక్కువ పెట్టుబడులతో సాగు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం సాగులో వున్నవి మధ్య మరియు దీర్ఘకాలిక రకాలు, పంట చివరి దశలో బెట్టకు గురి కావడం లేదా అధిక వర్షాలకు గురి కావడం, మొక్కల సాంద్రత సరైన మోతాదులో లేకపోవడం, కాయ తొలుచు పురుగులు మరియు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉండటం. ఈ మధ్య కాలంలో మన రాష్ట్రంలో కంది పండించే పలు జిల్లాల్లో వెర్రి తెగులు లేక స్టెరిలిటీ మొజాయిక్ తెగులు ఉధృతి క్రమేపి ఎక్కువగా నమోదు అవుతుంది, కంది పంటలో వెర్రి తెగులు ఉధృతి తగ్గించడానికి అధిక దిగుబడులు సాధించడానికి సమగ్ర సస్యరక్షణ చర్యల ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**చిత్త పురుగులు :**

పైరు లేత దశలో (2-4 ఆకులు) ఉన్నప్పుడు చిత్త పురుగులు ఆకులపై రంధ్రాలు చేసి నష్టం కలిగిస్తాయి. అతి చిన్నగా మెరిసే నల్లటి పెంకు పురుగులు ఆకుల అడుగు భాగాలలో ఉండి గుండ్రటి రంధ్రాలు చేసి తినివేస్తాయి. ఈ పురుగులు చేసిన రంధ్రాల వలన ఆకు విస్తీర్ణం తగ్గిపోయి మొక్క ఎండిపోతుంది.



బూడిద రంగు ముక్కు పురుగు నష్ట లక్షణం

### బూడిద రంగు ముక్కు పురుగులు :

తొలి దశలో ఈ పురుగు ఆశించినప్పుడు కాండాలను కొరికి వేయడం వలన మొక్కలు మోదుల్లాగా మారతాయి. మొక్కలు చనిపోతాయి. పంట నష్టం ఎక్కువైనప్పుడు పంట మళ్ళి విత్తుకోవాలి.

ఈ పురుగులను అదుపులో ఉంచడానికి కిలో విత్తనానికి 5 గ్రా. థయామిథాక్సామ్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ. మందుతో విత్తనశుద్ధి చేయాలి లేదా కందిని ఉలవతో కలిపి విత్తుకున్నప్పుడు ఉలవ కంది కంటే ముందుగా మొలకెత్తడం వలన చిత్త పురుగులు ఉలవ పంటను ఆశిస్తాయి. ఉలవ పంటపై క్లోరిపైరిఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం వలన కంది పంటపై నష్టాన్ని తగ్గించవచ్చు.

### స్టెరిలిటీ మొజాయిక్ తెగులు (వెర్రి తెగులు) :

స్టెరిలిటీ మొజాయిక్ తెగులు, మొదట 1931 లో బీహార్ రాష్ట్రంలోని పూసా నుండి గుర్తించడం జరిగింది. ఆ తరువాత భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో గుర్తించారు. మన దేశంలో కంది పండించే ప్రాంతాలలో వాతావరణంలో మార్పులు (గాలి, తేమ శాతం, ఉష్ణోగ్రతలు మరియు సాగు చేసే రకాలు) బట్టి ఉధృతి కనపడుతుంది. ఈ తెగులును వివిధ ప్రాంతాలలో గొడ్డు మోతు తెగులు లేక వెర్రి తెగులు లేక ఆకుపచ్చ ప్లేగ్ తెగులు అని అంటారు. గొడ్డు మోతు తెగులు వచ్చినప్పుడు కంది మొక్కలో పూత రాదు. కేవలం ఆకులు మాత్రం చిన్నవిగా మారి పత్రహరితం రంగు మారిపోతుంది. తెగులు సోకిన మొక్కలలో ఆకులు చిన్నవిగా మారి మరియు ఎక్కువ కొమ్మలు కలిగి ఉంటాయి, మొక్కలకు పూత మరియు కాయ ఏర్పడదు. అనుకూల వాతావరణ పరిస్థితులలో తెగులు చాల వేగంగా వ్యాప్తి చెందుతుంది. వెర్రితెగులు పంట విత్తిన 30-45 రోజుల లోపు వచ్చినట్లు అయితే తెగులు ఉధృతిని బట్టి పంటలో దాదాపు 95-100 శాతం దిగుబడులు తగ్గి పంట పూర్తిగా నష్టపోయే అవకాశం ఉంది.

ఈ తెగులు మొక్కను పూర్తిగా ఆశించవచ్చు లేదా కొన్ని కొమ్మలకు మాత్రమే రావచ్చు. మొక్కలో ఈ తెగులు సోకినప్పుడు రకాలను బట్టి మరియు అక్కడ ఉండే వాతావరణం బట్టి వివిధ లక్షణాలు గుర్తించవచ్చు. ఈ తెగులు లక్షణాలు మొక్కల వయస్సు మరియు వైరస్ బలంపై ఆధారపడి ఉంటాయి. మొదటిగా ఆకుల పైన ముదురు ఆకుపచ్చ బుడగల వంటి నిర్మాణాలు కనిపిస్తాయి. తరువాత ఇవి విరిగిన ఆకారాల్లో ఆకుపచ్చ రంగులో కనిపిస్తాయి, తరువాత దశలో ఆకులు చిన్నవిగా మారిపోతాయి మరియు ఎక్కువ శాఖీయ పెరుగుదల ఉండి మొక్క గిడసబారి పోతుంది. తెగులు లక్షణాలు, రకాలను మరియు మొక్క తట్టుకునే శక్తిని బట్టి మారుతాయి. ఇందులో భాగంగా తెగులును మూడు లక్షణాలుగా విభజించవచ్చు. 1) తీవ్రమైన మొజాయిక్ మరియు గొడ్డు చెట్లు 2) తేలికపాటి మొజాయిక్ తో కొన్ని కొమ్మలలో మాత్రమే పూత, పిందె లేకపోవడం 3) ఆకులలో రింగ్ ఆకారంలో మచ్చలు కలిగిన గొడ్డు చెట్లు.



ఆరోగ్యవంతమైన కంది మొక్క





వెర్రి తెగులు

మొక్కల మొదటి దశలో తెగులు సోకినప్పుడు తెగులు లక్షణాలు 10–15 రోజుల తర్వాత కనపడి ఆ లక్షణాలు మొక్క పుష్పించే సమయం దాకా ఉండి పూత రాదు. మొక్క కొంత ఎదిగిన తరువాత (60–70 రోజులకు) తెగులు సోకితే లక్షణాలు తక్కువగా కనపడుతాయి మరియు మొక్కపై కొన్ని కొమ్మలకు మాత్రం వ్యాపిస్తుంది అటువంటి మొక్కలలో 20–50% పూత గమనించవచ్చు. రైతులు సాధారణంగా ఈ తెగులును పూత రానప్పుడు మాత్రమే గమనించడం జరుగుతుంది అంతవరకు నివారణ చర్యలు చేపట్టకపోవడం వలన నష్టం తీవ్రత ఎక్కువగా వుంటుంది.

వెర్రి తెగులు అనేది ఒక వైరస్ తెగులు, ఈ తెగులు నల్లి (అసిరియా కజాని / ఇరియోఫిడ్) ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది చాలా సూక్ష్మంగా ఉండి కంటికి కనబడదు. దీని నోటి భాగములలో చిన్నటి సూదిలాంటి భాగం ఉంటుంది, దాని ద్వారా ఆకుల మీద గుచ్చి వైరస్ ను వ్యాప్తి చేస్తాయి. ఈ నల్లి గాలిలో దాదాపు 2 కి.మీ. వరకు ప్రయాణిస్తుంది మరియు గాలి ద్వారానే వేరే పొలాలకు విస్తరిస్తాయి. ఈ నల్లి జీవిత కాలం కేవలం రెండు వారాలు మాత్రమే అందులో గ్రుడ్డు దశ మరియు రెండు పిల్ల దశలు ఉంటాయి. తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన ఉండి రసం పీలుస్తూ తెగులును వ్యాప్తి చేస్తాయి. ఇది వైరస్ తెగులు అవడం వలన దీని నివారణకు తెగులును వ్యాప్తి చేసే నల్లిని నల్లి మందులతో మాములు పురుగు మందులు పని చేయవు.

### వెర్రి తెగులు సమగ్ర యాజమాన్యం :

- గత పంట తాలూకా తెగులు సోకిన మొక్కలు మరియు పంట అవశేషాలను సమూలంగా నాశనం చేయాలి.
- విత్తిన తర్వాత పంట కాలంలో క్రమం తప్పకుండా పొలాల్లో వ్యాధి లక్షణాల మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేసి నాశనం చేయాలి.
- మొదటగా తెగులు సోకిన మొక్కలను తీసివేసి నాశనం చేయాలి.
- మొదటిగా తెగులు సోకిన మొక్కలను తీసేవేసి వాటిని పాతిపెట్టాలి లేక తగలబెట్టాలి.
- పొలంలో మొక్కల సాంద్రత సరిగ్గా ఉండేటట్లు చూసుకోవాలి.
- ఈ తెగులను తట్టుకునే రకాలైన ఐ.సి.పి.ఎల్.–87119, ఐ.సి.పి.ఎల్.–85063 మరియు బి.ఎస్. యం.ఆర్.–756, 853 లను ఎన్నుకొని సాగు చేయవలెను. లాం ఫారం నుండి విడుదలైన ఎల్.ఆర్.జి. 105 (కృష్ణ) ఈ తెగులును తట్టుకుంటుంది.
- ఈ తెగులు నల్లి ద్వారా వ్యాప్తి చెందుతుంది కాబట్టి నల్లి నివారణకు లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధపు పొడి లేదా 4 మి.లీ. డైకోఫోల్ మందును ఒక లీటరు నీటికి కలిపి విత్తిన 30–35 రోజులకు పిచికారి చేయాలి.
- విత్తిన 60–65 రోజులకు ప్రోపర్ గైట్ 57% ఇ.సి. 2 మి.లీ. లేదా ఫెనజాక్విన్ 2.5 మి.లీ. లేదా ఫెన్ పైరోక్సిమాట్ 5% ఇ.సి. 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకుంటే నల్లిని నివారించి తద్వారా తెగులు వ్యాప్తి తగ్గించవచ్చును.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 98492 75470

### గమనిక : రైతు సేవలో టోల్ ఫ్రీ నెంబర్లు


| | | |
|---|---|---|
| ఫార్మర్స్ కాల్ సెంటర్ (ఆంగ్రూ) | : | 1800 425 0430 |
| ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ (డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రం) | : | 155251 |
| కిసాన్ కాల్ సెంటర్ | : | 1800 180 1551 |
| ఉద్యాన శాఖ | : | 1800 425 2960 |
| డా॥ వై.ఎస్.ఆర్. సంచార పశు ఆరోగ్య సేవ టోల్ ఫ్రీ నెం | : | 1962 |
| శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం | : | 1800 120 4209 |
| కిసాన్ సారథి | : | 1800 123 2175 లేదా 14426 |
| మత్స్య శాఖ | : | 1800 425 1188 |
| వాతావరణ సూచనలు (భారత ప్రభుత్వం) | : | 1800 180 1717 |

# వేరుశనగలో మొదలు కుళ్ళు తెగులు యాజమాన్యం

డా॥ కె. వేమన, ప్రధాన శాస్త్రవేత్త (తెగుళ్ళ శాస్త్రం); డా॥ డి. సంపత్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) & అధిపతి; డా॥ ఎ.పి. రాజేష్, ప్రధాన శాస్త్రవేత్త (వేరుశనగ) మరియు డా॥ ఇ. చంద్రాయుడు, ప్రధాన శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); వ్యవసాయ పరిశోధనా స్థానం, కదిరి.

**మొదలు కుళ్ళు తెగులు లక్షణాలు**


తెగులు ఆశించిన విత్తనాలు


తెగులు ఆశించిన కాండము


కాయలు నల్లగా మారుట మరియు కుళ్ళిపోవుట

వేరుశనగలో మొదలుకుళ్ళు తెగులు కాలర్ రాట్ లేదా క్రౌన్ రాట్ తెగులు అని కూడా అంటారు. ఈ తెగులు ఆశించడము వలన పంట దిగుబడిలో సుమారు 5-30 శాతం వరకు నష్టాన్ని కలుగ చేస్తుంది. ఇసుక తెర భూములు, తేలికపాటి ఎర్ర నేలల్లోనూ ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. విత్తన శుద్ధి చేయకుండా విత్తిన పొలాల్లోనూ, సరిగా కుళ్ళని సేంద్రీయ ఎరువును పొలంలో వేసినప్పుడు ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది.

**లక్షణాలు :**

- ఈ తెగులు ఆశించిన విత్తనాలు మొలకెత్తకుండానే కుళ్ళిపోతాయి. తెగులు ఆశించిన విత్తనాలను నల్లటి శిలీంధ్ర బీజాలతో కప్పబడి ఉంటుంది.
- మొలకెత్తిన తరువాత ఈ తెగులు ఆశించినట్లయితే భూమికి దగ్గరగా ఉన్న కాండము నల్లటి శిలీంధ్ర బీజాలతో కప్పబడి ఉంటుంది. కుళ్ళిన కాండము పీచులుగా మారుతుంది.
- పంట చివరి దశలో కాయలపై శిలీంధ్రము పెరగడము వలన కాయలు నల్లగా మారుతాయి మరియు కుళ్ళిపోతాయి.

**తెగులు వ్యాప్తి :** ఈ తెగులు విత్తనాల ద్వారాను మరియు మట్టి ద్వారా వ్యాప్తి చెందుతుంది. భూమిలో తక్కువ తేమ మరియు ఉష్ణోగ్రత 30-35$^{0}$ సెంటీగ్రేడ్ ఉన్నప్పుడు ఈ తెగులు ఎక్కువగా వృద్ధి చెందుతుంది.

**యాజమాన్యము :**

- తెగులు సోకని విత్తనాలను మాత్రమే వాడాలి.
- వర్షానికి తడిచిన కాయలను విత్తనంగా వాడరాదు.
- వేరుశనగ విత్తనాలను 5 సెం.మీ. కంటే లోతుగా విత్తరాదు.
- వేరుశనగ విత్తనాలను టెబ్యుకొనజోల్ 2 డి.యస్. 1 గ్రా. / 1 కిలో విత్తనము లేదా మాంకోజెబ్ 50% + కార్బండెజిమ్ 25% 3 గ్రా. / 1 కిలో విత్తనానికి పట్టించి విత్తుకోవాలి.
- పంట మీద ఎకరాకు 400 గ్రా. మాంకోజెబ్ లేదా 400 మి.లీ. హెక్సాకొనజోల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి నేల మరియు మొక్కలు తడిచే విధంగా పిచికారి చేయాలి.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 96422 76238

# కుసుమ సాగులో మెళకువలు

డా॥ జి. శశికళ, సహ ఆచార్యులు (సేద్య శాస్త్రం); వ్యవసాయ కళాశాల, తిరుపతి; డా॥ బి.కె. కిషోర్ రెడ్డి, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ బి. చందన, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం); డా॥ మాధవి, శాస్త్రవేత్త (పశు వైద్య శాస్త్రం) మరియు డా॥ ఎస్.ఎన్. మల్లీశ్వరి, కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం, రెడ్డిపల్లి.





కుసుమ రబీ నూనె గింజ పంట. ఈ పంటను ప్రస్తుతము మన రాష్ట్రంలో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప మరియు ప్రకాశం జిల్లాలలో సాగు చేయబడుతుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల మార్పు, నూతన రకాల రూపకల్పన, యాంత్రీకరణకు అనువుగా సాగు చేయబడటం, అధిక మద్దతుధర, తక్కువ పెట్టుబడి వంటి పలు అంశాల దృష్ట్యా ఈ పంటకు నెమ్మదిగా ప్రాచుర్యం పెరుగుతుంది. ఈ పంట శనగ మరియు రబీ జొన్న పంటలకు మంచి ప్రత్యమ్నాయం. ఈ పంట ముళ్ళను కలిగి ఉండుట వలన బెట్టను బాగా తట్టుకుంటుంది. అంతేకాక అడవిపందులు, జింకల బెడద ఉన్న ప్రాంతాలలో ఈ పంటను సురక్షితంగా వేసుకొనవచ్చు. కుసుమ పంట వర్షాధారంగా రెండవ పంటగా సాగుకు అనువైనది. తొలకరి వర్షాలతో స్వల్పకాలిక అపరాలు, చిరుధాన్యాల కోత తరువాత వర్షాలతో కుసుమ సాగును చేపట్టవచ్చు. కుసుమ పంటలో అన్ని నూనెగింజల పంటల కన్నా అధికంగా పాలీ అసంతృప్త కొవ్వు ఆమ్లాలు (78%) ఉన్నాయి. కుసుమలో నూనెశాతం 29-33% ఉంటుంది.

**అనువైన వాతావరణ పరిస్థితులు :** కుసుమ పంట కాంతిపరంగా తటస్థ మొక్క అయినప్పటికీ ఉష్ణోగ్రతకు సున్నితమైన పంట. ఈ పంట పొడిగా ఉంటే వాతావరణ పరిస్థితులకు అనుకూలమైనది. సుదీర్ఘ వర్షాలు లేదా ఎక్కువ మంచు పుష్పించే దశలో ఉన్నట్లయితే దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పంట పూతకు 24-32$^0$ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత అనువైనది. ముఖ్యంగా నేలలోని తేమ పంట దిగుబడులను ప్రభావితం చేస్తుంది.

**అనువైన నేలలు :** ఈ పంట సాగుకు నీరు నిలవని, బరువైన, తేమను నిలుపుకోగలిగే నల్లరేగడి మరియు నీటి వసతి గల ఎర్రగరప నేలలు అనుకూలమైనవి. ఈ పంట కొద్దిపాటి క్షారత్వాన్ని తట్టుకోగలదు.

**అనువైన రకాలు :** కుసుమ పంటలో టి.ఎస్.ఎఫ్. -1, మంజీర మరియు సాగర ముత్యాలు అను పాత రకాలే కాకుండా ఇటీవల కొన్ని నూతన రకాలు కూడా రూపొందించబడినవి.

**విత్తనశుద్ధి :** నేల ద్వారా వ్యాపించే ఎండు తెగులు మరియు విత్తనము ద్వారా వ్యాప్తి చెందే ఆల్టర్నేరియా ఆకుమచ్చ, తుప్పు

| రకము/సంకరము | పంట కాలము | దిగుబడి (కిలో/హె.) | ప్రత్యేక గుణగణాలు |
|---|---|---|---|
| ఐ.ఎస్.ఎఫ్.-764 | 125-130 | 1583 (వర్షాధారం) 2274 (నీటి పారుదల) | అధిక నూనె శాతం (31%) గల రకము |
| ఐ.ఎస్.ఎఫ్.-1 | 125-130 | 1236 (వర్షాధారం) 1864 (నీటి పారుదల) | మొట్టమొదటిగా విడుదల చేయబడిన అధిక ఓలిక్ ఆమ్లము (76%) గల రకము. 31% నూనెను కలిగి ఉంటుంది. |
| డి.ఎస్.హెచ్. - 185 (సంకరము) | 120-125 | 1600 (వర్షాధారం) 2250 (నీటి పారుదల) | ఎండు తెగులును తట్టుకుంటుంది. 28-29% నూనెను కలిగి ఉంటుంది. |
| ఎస్.ఎస్.-12-40 | 122-125 | 1713 (నీటి పారుదల) | పేనుబంకను మధ్యస్థంగా తట్టుకుంటుంది. నీటి పారుదల క్రింద అనువైన రకము. 32.9% నూనెను కలిగి ఉంటుంది. |
| రాజ్-విజయ్ | 138-140 | 2710 (నీటి పారుదల) | 34% నూనెను కలిగి ఉంటుంది. |
| ఎస్.ఎస్.ఎఫ్.-13-71 | 125-130 | 1621 (వర్షాధారం) 2575 (నీటి పారుదల) | ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులును తట్టుకుంటుంది. |
| సి.జి.- కుసుమ | 120-125 | 1677 | 32-34% నూనెను కలిగి ఉంటుంది. ఎండు తెగులును తట్టుకుంటుంది. |
| ఐ.జి.కె.వి.- కుసుమ | 138-140 | 2710 | 34% నూనెను కలిగి ఉంటుంది. ఎండు తెగులును తట్టుకుంటుంది. |

తెగుళ్ళ నివారణకు విత్తనశుద్ధి చేయాలి. కిలో విత్తనానికి కార్బండెజిమ్ 1 గ్రా. లేదా సాఫ్ (కార్బండెజిమ్ 12% + మాంకోజెబ్ 63%) 2 గ్రా. మందుతో శుద్ధి చేసుకోవాలి.

**విత్తన మోతాదు :** ఎకరాకు 4 కిలోల విత్తనం సరిపోతుంది. అంతర పంటగా అయితే 1.5 కిలోల విత్తనం కావాలి.

**విత్తు సమయము :** కుసుమ సాగుకు అక్టోబరు మాసము అనుకూలము. వర్షాలు 'ఆలస్యమైనప్పుడు నవంబరు మొదటి పక్షము వరకు కూడా విత్తుకోవచ్చు.

**విత్తే దూరము :** వరుసల మధ్య 45 సెం.మీ. మరియు వరుసలలోని మొక్కల మధ్య 20 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. విత్తులోతు 5 సెం.మీ. కంటే ఎక్కువైన మొలక శాతం తగ్గుతుంది.

**పలుచన చేయుట :** పంట మొలకెత్తిన 10-15 రోజుల తరువాత కుదురుకు ఒక ఆరోగ్యవంతమైన మొక్కను మాత్రమే ఉంచుకోని మిగిలిన మొక్కలను తీసివేయాలి.

**ఎరువుల యాజమాన్యం :** విత్తుటకు 2-3 వారాలు ముందు బాగా చివికిన పశువుల ఎరువును 5 టన్నులు ఒక హెక్టారుకు వేసుకోవాలి. భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. దుక్కిలో 35 కిలోల యూరియా మరియు 110 కిలోల ఎస్.ఎస్.పి. ఎరువులను వేసుకోవాలి. నీటి వసతి క్రింద సాగు చేసినప్పుడు సిఫారసు చేసిన యూరియాలో 50% మరియు పూర్తి భాస్వరము దుక్కిలో వేసుకోవాలి. మిగిలిన 50% యూరియా 5 వారాల తర్వాత మొదటి తడి ఇచ్చేటప్పుడు పై పాటుగా వేయాలి. నేలలో గంధకము లభ్యత తక్కువగా ఉన్నట్లయితే ఎకరాకు 6-12 కిలోల గంధకాన్ని వేసుకోవాలి.

**నీటి యాజమాన్యం :** కుసుమ పంటలో కీలక దశలైన కాండం సాగే దశ (30-35 రోజులు) లేక పూత దశలో (65-75 రోజులు) ఒక తడి ఇచ్చిన దిగుబడి 40-60% పెరిగే అవకాశముంది.

**కలుపు నివారణ, అంతర కృషి :** విత్తిన 20-30 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. విత్తిన 25 మరియు 40-45 రోజులకు దంతులు తోలి అంతర కృషి చేయాలి. దీని వలన కలుపు నివారణతో పాటు నేలలోని తేమను కూడా సంరక్షించుకోవచ్చు. పెండిమిథాలిన్ 30% అనే కలుపు మందును ఎకరాకు లీటరు చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజున గాని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**సస్యరక్షణ :**

**పేనుబంక :** ఇది కుసుమ పంటను ఎక్కువగా ఆశించి

నష్టపరుస్తుంది. వీటి ఉధృతి ఎక్కువైనప్పుడు మొక్కలు కురచగా తయారై బలహీనంగా ఉండిపోతాయి. అంతేకాకుండా మొక్కలు వడలి ఎండిపోవడం గమనించవచ్చు. ముళ్ళు లేని రకాలకు పేను తాకిడి ఎక్కువగా ఉండును. పురుగు ఉనికిని గమనించిన వెంటనే వేపగింజల కషాయము 5% లేదా వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువైతే బ్యుప్రొఫెజిన్ 1.5 మి.లీ. లేదా ఫ్లోనికమైడ్ 0.3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**లద్దె పురుగు :** లద్దె పురుగు ఆకు యొక్క పత్రహరితాన్ని గోకి వాటిని జల్లెడ లాగా మారుస్తాయి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు జల్లెడ లాగా మారిన ఆకులు ఎండిపోయినట్లు కనిపించును. ఈ పురుగు నివారణకు ఎస్.ఎల్.ఎన్.పి.వి. వైరస్ ద్రావణమును (250-300 లార్వాలకు సమానంగా) నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**పచ్చ పురుగు :** ఆకు పైన రంధ్రాలు ఉండి లేత కొమ్మలను వాటి చిగుర్లను కొరికి తింటూ నష్టం కలిగిస్తుంది. కాయలపై కూడా రంధ్రాలు చేసి నష్టపరుస్తుంది. ఈ పురుగు నివారణకు 1) శనగను అంతర పంటగా వేయరాదు. 2) అధిక మోతాదులో నత్రజనిని వాడరాదు 3) హెచ్.ఎ.ఎన్.పి.వి. వైరస్ ద్రావణమును (250-300 లార్వాలకు సమానంగా) నీటిలో కలిపి పిచికారి చేయాలి. లద్దెపురుగు మరియు పచ్చపురుగుల ఉధృతి తగ్గించుకొనుటకు ఎకరానికి 8 చొప్పున లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలి. ఒకవేళ పైరుపై తీవ్ర ఉధృతి గమనించినచో ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.4 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు :** కుసుమ పంటకు అధిక నష్టాన్ని కలిగించే తెగుళ్ళలో ఇది చాలా ముఖ్యమైనది. తెగులు ఆశించిన మొక్కల క్రింది ఆకులపై 2-3 మి.లీ. పరిమాణంలో గోధుమ వర్ణపు మచ్చలు కనిపించి క్రమంగా వలయాకారంలోకి మారి పై ఆకులకు వ్యాపిస్తాయి. వ్యాధి తీవ్రత ఎక్కువైనప్పుడు కాండంపై కూడా ఈ రకమైన మచ్చలను గమనించవచ్చును. తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఆకులు పూర్తిగా మట్టి రంగులోకి మారి ఎండిపోతాయి.

**సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు :** ఈ తెగులు కుసుమ పంటను పూత దశలో ఎక్కువగా ఆశిస్తుంది. ఆకులపై 3-10 మి.మీ. పరిమాణంలో మచ్చలు ఏర్పడి మచ్చల చుట్టూ పసుపు రంగు వలయాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మొగ్గలు మరియు వాటి చుట్టూ ఉండే ఆకుల పైన ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి.

వీటి నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి మచ్చలు కనపడగానే ఒకసారి, 7 నుండి 10 రోజుల తరువాత మరోసారి పిచికారి చేసుకోవాలి.

**ఫ్యుజేరియం ఎండు తెగులు :** ప్రతిసారి ఒకే పొలంలో కుసుమ వేసినట్లయితే ఎండు తెగులును కలుగజేసే ఫ్యుజేరియం యొక్క ఉధృతి పెరుగుతుంది. దీని వలన ఆకులు పాక్షికంగా పసుపు బారి వడలిపోయి చివరకు మొక్కలు ఎండిపోతాయి. ఈ తెగులు నేల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు నివారణకు కార్బండెజిమ్ 1 గ్రా. లేదా సాఫ్ (కార్బండెజిమ్ 12% + మాంకోజెబ్ 63%) 2 గ్రా. ఒక కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి. తెగులు ఉధృతిని అదుపులో ఉంచుటకు, ఎకరాకు 2 కిలోల ట్రైకోడెర్మా పొడిని 4 కిలోల వేప చెక్కతో కలిపి 90-100 కిలోల పశువుల ఎరువులో 10-15 రోజులు వృద్ధి చేసి పొలంలో చల్లుకోవాలి. తెగులు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలలో తెగులును కొంత వరకు తట్టుకోగల రకాలైన డి.ఎస్.హెచ్.-185 ను సాగు చేయాలి.

**పక్షుల బెడద :** ఈ పంటను తక్కువ కమతాలలో సాగు చేసినట్లయితే రామచిలుకల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణకు గింజ పక్వ దశలో ఉదయము మరియు సాయంత్రం వేళల్లో పక్షులను తరిమి వేయాలి.

**పంట కోత :** రకాలను బట్టి విత్తిన 110-140 రోజులకు పంట కోతకు వస్తుంది. ప్రస్తుత పరిస్థితులలో మనుష్యులతో కంటే వరికోత యంత్రముతో ఈ పంటను కోసినట్లయితే ఖర్చు తగ్గుతుంది. ఆ తరువాత నిల్వచేయుటకు గింజలలో తేమశాతం 5-8 ఉండేలా చూసుకోవాలి. గింజ దిగుబడితో పాటు కుసుమ పూరేకులలో గల ఔషధ గుణాల దృష్ట్యా పూత విచ్చుకున్న 15-20 రోజుల తరువాత వడలిపోయిన పూరేకులను సేకరించడం వలన ఎకరాకు సుమారు 25-45 కిలోల పూరేకుల దిగుబడిని పొందవచ్చు.

**మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన**
**ఫోన్ నెం : 70954 36060**

# గిరిజన ప్రాంతంలో బంగాళదుంప సాగులో మెళకువలు

డా॥ బి.ఎన్. సందీప్ నాయక్, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); డా॥ వి. రాజేంద్ర ప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త (ఆర్థిక శాస్త్రం); డా॥ ఎమ్. శ్రీనివాసరావు, శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం); డా॥ పి. జోగారావు, శాస్త్రవేత్త (మృత్తిక శాస్త్రం); డా॥ ఎస్. వంశీ కృష్ణ, సహ పరిశోధకులు (ఉద్యాన శాస్త్రం); డా॥ ఎన్. గణపతి, సహ పరిశోధకులు (సేద్య శాస్త్రం) మరియు డా॥ ఎమ్. సురేశ్ కుమార్, పరిశోధనా సహ సంచాలకులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, చింతపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా.







**మ**న్యం విభిన్న వాతావరణ పరిస్థితులతో కూడి ఉంటుంది. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులలో వివిధ పంటలు సాగు చేసే అవకాశం ఉంది. సాధారణంగా గిరిజన ప్రాంతపు రైతులు ఆహారపు పంటలైన వరి, మొక్కజొన్న చిరుధాన్యలైన రాగి, కొర్ర, సామ, జొన్న, సజ్జ; సుగంధ పంటలైన పసుపు, అల్లం; ఉద్యాన పంటలైన కాఫీ, మిరియాలు మరియు నూనె గింజ పంటైన వలిశెలు వంటి పంటలను సాగు చేస్తుంటారు. మారిన సామాజిక; ఆర్థిక మరియు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇటీవల కాలంలో గిరిజనులు సంప్రదాయ ఆహార పంటల సాగును తగ్గించి వాణిజ్య పంటలైన పసుపు, అల్లం, కాఫీ మరియు మిరియాల సాగువైపు మొగ్గు చూపుతున్నారు.

### వాతావరణం :

ఆంధ్రప్రదేశ్ లోని గిరిజన ప్రాంతంలో సాధరణంగా శీతాకాలం అక్టోబర్ నెలలోని ప్రారంభమై ఫిబ్రవరి మాసం వరకు ఉంటుంది. ఈ కాలంలో కనిష్ట సరాసరి ఉష్ణోగ్రతలు 10.0 – 19.0 డిగ్రీల సెల్సియస్, గరిష్ట సరాసరి ఉష్ణోగ్రతలు 26.0–

32.0 డిగ్రీల సెల్సియస్, సరాసరి తేమ శాతం 50.0-90.0% వరకు ఉండి, సాధారణ వర్షపాతం ఈ కాలంలో సుమారుగా 270.0 మి.మీ., సరాసరిన 16.0 రోజుల పాటు ఉంటుంది.

**అనుకూల పరిస్థితులు :**

సంప్రధాయ పంటలైన రాజ్మా, వలిశెలు వంటి పంటల సాధారణ విస్తీర్ణం మరియు చీడపీడల బెడద వలన వరి ఉత్పత్తి గిరిజన ప్రాంతంలో తగ్గుముఖం పడుతున్నాయి. గిరిజనుల ఆహార భద్రత దృష్ట్యాపై వాతావరణానికి సరిపడే అనుకూలమైన ఆహార పంటలను అన్వేషించవల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపధ్యంలో చల్లని వాతావరణంతో పాటు అనుకూలమైన పగటి మరియు రాత్రి ఉష్ణోగ్రతల రీత్యా ఉన్నత పర్వత శ్రేణి మరియు గిరిజన మండలం బంగాళా దుంప సాగుకు ఎంతో అనుకూలం.

**బంగాళాదుంప సాగు అనుకూలమైన యాజమాన్య పద్ధతులు :**

**పంట కాలం :** రబీ కాలం సాగుకు అనుకూలం. అక్టోబర్ రెండవ పక్షం నుండి నవంబరు మొదటి వారం వరకు నాటుకోవచ్చు. కొన్ని పరిస్థితుల్లో ఖరీఫ్ పంటలు దెబ్బ తిన్నప్పుడు సెప్టెంబర్ ఆఖరిలో కూడా నాటుకోవచ్చు.

**విత్తనం :** నేలను 4-5 కళ్ళు ఉన్న దుంపలు ఎంచుకొని వాటిని విడివిడిగా ముక్కలు చేసుకొని, వాటిని 2-3 గంటల వరకు బ్లైటాక్స్ మందు ద్రావణంలో ఉంచి తరువాత వాటిని నాటుకోవాలి. నాటేటప్పుడు కళ్ళు పైవైపు ఉండేలా చూసుకోవాలి. ముక్కలు చేసిన విత్తన దుంపలు ఎకరాకు 6 నుండి 8 క్వింటాళ్ళు అవసరం ఉంటుంది.

**నీటి యాజమాన్యం :** నేలను, వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని నీరు పెట్టాలి. చల్కా నెలల్లో, మొలకెత్తడానికి ముందు 7-8 రోజుల వ్యవధిలోను, దుంప ఏర్పడేటప్పుడు 4-5 రోజులు వ్యవధిలో నీరు పెట్టాలి.

**కలుపు నివారణ, అంతరకృషి :**

అభివృద్ధి చెందుతున్న దుంపలపై సూర్యరశ్మి పడితే, దుంప ఆకుపచ్చ రంగుకు మారుతుంది. కాబట్టి విత్తిన 30 రోజుల తర్వాత సుమారు 3-4 సార్లు మట్టిను ఎగతోయాలి. ఈ కాలంలో కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

**ఎరువుల యజమాన్యం :** ఆఖరి దుక్కిలో ఎకరాకు 10-12 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. ఆఖరి దుక్కిలో 40 కిలోల యూరియా, 150 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 30 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. విత్తిన 30 రోజుల తరువాత 40 కిలోల యూరియా, 50 రోజులకు మరో 20 కిలోల యూరియా, 30 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.

**కోత :** నేల పైభాగంలో మొక్క వాలిపోయి, పసుపు వర్ణం నుండి గోధుమ వర్ణంకు మారి పడిపోతుంది. సాధారణంగా నాటిన 90-100 రోజుల్లో కోతకు సిద్ధం అవుతుంది. దుంపలకు తగలకుండా జాగ్రత్తగా గడ్డ పారతో త్రవ్వి, నీడలో ఆరబెట్టాలి. తర్వాత నిల్వ చేయాలి.

**దిగుబడి :** ఎకరాకు 10-14 టన్నుల వరకు వస్తుంది.

**పంట సాగులో జాగ్రత్తలు :** శీతాకాలంలో మాత్రమే సాగు చేసుకోవాలి. అక్టోబర్ నుండి నవంబర్ నెలల్లో దుంపలను నాటే ముందు 1 గ్రా. కార్బండెజిమ్ లేదా 3 గ్రా. మాంకోజెబ్ లీటరు నీటికి కలిపిన మందు ద్రావణంలో అరగంట సేపు ఉంచి నాటుకోవాలి. మొలక శాతం పెంచడానికి దుంపలను 1 పి.పి.యం., జిబ్రాలిక్ ఆసిడ్ ద్రావణంలో (1 గ్రా. లీటరు నీటికి) గంట సేపు ఉంచి, తర్వాత ఆరబెట్టి 10 రోజులు ఉంచాలి. దుంపలను బోదెలపైనా నాటుకోవాలి. దుంపల పెరుగుదల దశలో సూర్యరశ్మి సోకాకుండా మట్టిని ఎగదోయలి. మొక్క పెరుగుదల దశలో తప్పనిసరిగా నీటిని ఇవ్వాలి. విత్తిన 35 రోజుల తర్వాత మట్టిని తప్పని సరిగా ఎగదోయాలి. మరల 30 రోజుల తర్వాత రెండవ సారి మట్టిని ఎగదోయాలి. దుంపలను $1^0$-$27^0$ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత మరియు 90% తేమ వద్ద నిల్వ చేసుకోవాలి.

చింతపల్లిలో సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు వ్యవసాయ భాగస్వామ్య యాజమాన్య పథకంలో భాగంగా ప్రయోగాత్మకంగా 2022-23 పంట కాలంలో బంగాళా దుంప సాగును చేపట్టి ఆశాజనకమైన దిగుబడిని సాధించడం జరిగింది. కావున గిరిజన రైతాంగం శీతాకాలంలో తమ ఇంటి పరిసరాలలో మరియు పొలంలో అనుకూలమైన చోట కనీసం తమ గృహ అవసరాల నిమిత్తం బంగాళా దుంప సాగును చేపట్టగలరు. పెద్ద విస్తీర్ణంలో సాగు చేపట్టాలనుకునేవాళ్ళు ఉద్యాన శాఖ, నాబార్డు వంటి ఇతర సంస్థల నుండి సాంకేతిక మరియు ఆర్థిక సహాయాన్ని పొందగలరు.

**మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన**
**ఫోన్ నెం : 94904 22282, 91779 96952**

# టిష్యూ కల్చర్ అరటి సాగులో పాటించవలసిన మెలకువలు

డా॥ యస్. నాగలక్ష్మీ, సహ ఆచార్యులు (బయోటెక్నాలజీ), ఉద్యాన కళాశాల, పార్వతీపురం; డా॥ బి. స్పందన, సహ ఆచార్యులు (బయోటెక్నాలజీ), వ్యవసాయ కళాశాల, నైరా.

ఆంధ్రప్రదేశ్‌లో అరటి పంటను సుమారు లక్ష హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తూ, 6 మిలియన్ టన్నుల ఉత్పత్తితో భారతదేశంలో మొదటి స్థానంలో ఉన్నది. ఇందులో సరియైన సస్యరక్షణ చేపట్టకపోవడం, నాణ్యమైన పిలక మొక్కలు రైతులకు అందుబాటులో లేకపోవడం వలన టిష్యూకల్చర్ అరటి మొక్కల ప్రాముఖ్యత పెరిగింది.

టిష్యూకల్చర్ అనగా నాణ్యమైన అరటి పిలకల కణజాలం నుండి ప్రయోగశాలలో అభివృద్ధి పరచిన మొక్కలు ఆరోగ్యవంతమైన బలమైన పిలకల నుండి సేకరించిన కణజాలం నుండి అభివృద్ధి పరచిన మొక్కలు తెగుళ్ళు లేనివిగాను, ఆరోగ్యవంతంగాను ఉండును. పొలంలో నాటినప్పుడు వేగంగా బలంగాను ఎదిగి మామూలు పిలకల కన్నా కూడా 35-45 శాతం వరకు అధిక దిగుబడిని ఇస్తాయి.

### రైతులు టిష్యూకల్చర్ మొక్కల ఎంపికలో తీసుకోవలసిన మెళకువలు :

- కొనుగోలు చేసే నాటికి మొక్కలు కనీసం 45 రోజుల వయస్సు (హార్డెనింగ్) కలిగి ఉండాలి.
- మొక్కలు ఆరోగ్యంగా ఉండి ఎటువంటి పోషక లోపాలు మరియు చీడపీడలు లేకుండా ఉండాలి.
- మొక్కలు 30 సెం.మీ. పొడవు ఉండి 5 నుండి 6 ఆకులు కలిగి ఉండాలి.
- ప్రభుత్వ సంస్థలు లేదా డి.బి.టి. వారి ధృవీకరణ పత్రము కలిగిన ప్రవేటు కంపెనీల నుండి తయారు చేయబడిన మొక్కలు మాత్రమే కొనుగోలు చేయాలి.
- రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. కొనుగోలు రసీదులో మొక్క యొక్క రకం, మొక్కల సంఖ్య, కొనుగోలు తేది మొదలైన వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి.

### మొక్కలు కొనుగోలు చేసిన తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలు :

మొక్కల దూర ప్రాంతాల నుండి రవాణా చేసిన తరువాత నీడలో ఉంచి, నీటిని అందించాలి.

### నేల తయారీ మరియు నాటే పద్ధతి :

నేలను 4 సార్లు 40 సెం.మీ. లోతులో మెత్తగా దున్నాలి. గుంటను త్రవ్వి గుంటలో 200 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 3 కిలోల పశువుల ఎరువు 10 గ్రా. కార్బోఫ్యూరాన్ గుళికలను మిశ్రమంగా చేసి గుంతను పూడ్చాలి. తరువాత టిష్యూకల్చర్ మొక్కలను గుంటలో నాటి నీరు పోయాలి.

### ప్రధాన పొలములో మొక్క నాటిన వెంటనే చేపట్టవలసిన చర్యలు :

- ప్రధాన పొలములో మొక్కలను సాయంత్రం సమయంలో నాటుకొని వెంటనే నీటిని అందించాలి.
- నాటిన 2 వ లేదా 3 రోజు, మొక్క మొదలు వద్ద గాలి చొరబడకుండా మట్టిని తొక్కాలి.
- మొక్క ఒకటి లేదా రెండు క్రొత్త ఆకులు తొడిగినట్లయితే ఆ మొక్క బ్రతికినట్లు నిర్ధారించుకొని తర్వాత ఎరువులను వేయాలి.
- మొక్కలు నాటిన తర్వాత, త్వరగా పెరుగుటకు మొదటి మూడు నెలలు తగినంత పోషకాలను తప్పనిసరిగా ఇవ్వాలి.
- పోషకాలను కాంప్లెక్స్ ఎరువుల కన్నా కూడా సూటి ఎరువులుగా యూరియా రూపంలో, పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఇవ్వడం ద్వారా ఖర్చు తగ్గించు కొనవచ్చు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 94406 84275

# పైనాపిల్‌తో విలువ ఆధారిత ఉత్పత్తులు

డా॥ బి. సునీత, శాస్త్రవేత్త (సామాజిక విజ్ఞాన శాస్త్రం); డా॥ కె. భాగ్యలక్ష్మీ, కార్యక్రమ సమన్వయ కర్త;
డా॥ ఎస్. నీలవేణి, సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం); డా॥ వి. హరికుమార్, శాస్త్రవేత్త (ఉద్యాన శాస్త్రం);
డా॥ యస్. కిరణ్ కుమార్, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు డా॥ యస్. అనూష, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం);
కృషి విజ్ఞాన కేంద్రం, ఆమదాలవలస.

పైనాపిల్ లేదా అనాసను ప్రపంచ వ్యాప్తంగా పండిస్తారు. మనదేశంలో అస్సాం, మేఘాలయ, త్రిపుర, సిక్కిం, మిజోరం, పశ్చిమ బెంగాల్, కేరళ, కర్ణాటక, గోవాలలో పండిస్తారు. ఉత్తర కోస్తాలోని పర్వత ప్రాంతాల్లో ముఖ్యంగా శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లోని గిరిజనులు పైనాపిల్‌ను విరివిగా పండిస్తారు. ఇది బ్రొమిలియేసి కుటుంబానికి చెందినది. వర్షాకాలంలో ఎక్కువ దొరికే పైనాపిల్ రుచితోపాటు ఎన్నో పోషక విలువలను కలిగి ఉంటుంది.

**పోషక విలువలు :**

- పైనాపిల్ "బ్రొమోలిన్" అనే ప్రోటియోలైటిక్ (మాంస కృత్తులను విచ్ఛిన్నం చేసే) ఎంజైమ్ ఉండటం వల్ల ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అందువల్ల ఈ పండును ఎన్నో ఔషధాల తయారీకి వినియోగిస్తారు.
- ఈ పండులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల కంటి చూపును మెరుగుపరచడంలో శరీరాన్ని దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షించడంలో తోడ్పడుతుంది.
- అనాసలో పీచుపదార్థం అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియ సాఫీగా ఉండేలా చూసి మలబద్ధకాన్ని నివారిస్తుంది.
- ఎముకల దృడత్వాన్ని పెంచే పొటాషియం ఇందులో అధికంగా ఉంటుంది.
- పైనాపిల్‌లో విటమిన్ సి లేదా ఆస్కార్బిక్ ఆసిడ్ అధికంగా ఉండటం వల్ల ఇది స్కర్వీ వంటి వ్యాధులు రాకుండా చేయడమే కాకుండా మన శరీరంలో వ్యాధి నిరోధకతను పెంచుతుంది.
- పైనాపిల్ పండు నుంచే గాక వాటి ఆకుల నుంచి నాణ్యమైన నారును పండు పైభాగంలో ఉండే తొక్క నుండి బ్రోమిలిన్ అనే ఎంజైమ్‌ని తీస్తారు.

**100 గ్రా. పైనాపిల్ లో ఉండే పోషక విలువలు :**

| | | |
|---|---|---|
| నీరు | - | 87.8 గ్రా. |
| క్రొవ్వు | - | 0.1 గ్రా. |
| కాల్షియం | - | 20 మి.గ్రా. |
| ఐరన్ | - | 2.4 గ్రా. |
| పొటాషియం | - | 37.0 గ్రా. |
| కెరోటిన్ | - | 18.00 మి.గ్రా. |
| ప్రోటీన్ | - | 0.4 గ్రా. |
| పిండి పదార్థం | - | 10.8 గ్రా. |
| ఫాస్ఫరస్ | - | 9 గ్రా. |
| సోడియం | - | 37.7 గ్రా. |
| మాంగనీసు | - | 0.56 గ్రా. |
| శక్తి | - | 46 కిలో కేలరీలు |

**ఉప ఉత్పత్తుల తయారీ :**

పైనాపిల్ పండులో ఇన్ని పోషక విలువలు ఉన్నా ఇవి చాలా తక్కువ కాలం నిల్వ ఉంటాయి. రిఫ్రిజిరేటర్‌లో కూడా ఎక్కువ కాలం నిల్వ ఉండవు. అన్ని కాలాల్లో తినాలన్నా, పండ్లు ఎక్కువ కాలం నిల్వ ఉండాలన్నా వీటితో విలువ ఆధారిత పదార్థాలైన జామ్‌లు, స్క్వాష్‌లు, క్యాండీ, పచ్చళ్ళు తయారు చేయడం ఎంతో అవసరం. పైనాపిల్‌తో విలువాధారిత ఉత్పత్తులు తయారు చేయడానికి 'క్యూ' రకం పైనాపిల్ అనుకూలమైన పైనాపిల్ విరివిగా ఉన్నప్పుడు తక్కువ ధరకు దొరుకుతాయి. వీటిలో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి మంచి ఉపాధి అవకాశంగా మలుచుకోవడం.

**పైనాపిల్ స్క్వాష్ :**

**కావాల్సిన పదార్థాలు :**

| | | |
|---|---|---|
| పైనాపిల్ జ్యూస్ | : | 1 లీటరు |
| నీరు | : | 1 లీటరు |
| పంచదార | : | 2 కిలోలు |
| సిట్రిక్ ఆసిడ్ లేదా నిమ్మ ఉప్పు | : | 20 గ్రా. |
| పొటాషియం మెటాబైసల్ఫేటు | : | అర టీ స్పూన్ |
| లెమెన్ ఎల్లోకలర్ | : | కొంచెం |
| పైనాపిల్ ఎసెన్స్ | : | 4 చుక్కలు |




**తయారీ విధానం :** ముందుగా పైనాపిల్ తొక్కను తీసివేసి దాని మధ్యలోని గట్టి భాగాన్ని తీసేసి, చిన్న ముక్కలుగా చేయాలి. తర్వాత వీటిని మిక్సీలో వేసి జ్యూస్ చేసుకోవాలి. ఒక లీటరు నీటిలో పంచదార కలిపి ఒక పొంగు వచ్చిన తర్వాత దానిని చల్లార్చి వడపోయాలి. వడపోసి పెట్టుకున్న పాకంలో జ్యూస్ వేసి కలపాలి. తర్వాత గోరు వెచ్చని నీరు కొద్దిగా తీసుకొని దానిలో మెటా బై సల్ఫేట్, లెమన్ ఎల్లో రంగు కలిపి ఎసెన్స్‌తో పాటు జ్యూస్‌లో కలపాలి. ఇప్పుడు ఈ స్క్వాష్‌ను తడిపేసి సీసాలో నింపుకొని భద్రపరుచుకోవాలి.

**పైనాపిల్ క్యాండి**

**కావాల్సిన పదార్థాలు :**

| | | |
|---|---|---|
| పైనాపిల్ | : | 500 గ్రా. |
| నీరు | : | 250 గ్రా. |
| పంచదార | : | 4 కప్పులు |
| తయారీ విధానం | : | ముందుగా |

**తయారీ విధానం :** ముందుగా పైనాపిల్ తొక్క తీసివేసి చిన్న చతురస్రాకారంలో కత్తిరించుకోవాలి. తర్వాత రెండు కప్పుల పంచదారకు ఒక కప్పు నీరుపోసి తీగ పాకం తీసుకోవాలి. దానిలో పైనాపిల్ ముక్కలు అదే పాకంలో రాత్రి అంతా నాననివ్వాలి. నానిన పైనాపిల్ ముక్కలను సోలార్ డ్రైయర్‌లో 10-24 గంటలు ఎండబెట్టాలి. ఎండిపోయిన పైనాపిల్ ముక్కలను పంచదార పొడిలో దొర్లించి సెల్లోఫేన్ సంచుల్లో ప్యాక్ చేయాలి.

**పైనాపిల్ జామ్ :**

**కావాల్సిన పదార్థాలు :** పైనాపిల్ - 4, బొప్పాయి-1 పండు, పంచదార-2 కిలోలు, నిమ్మ ఉప్పు - 4 టీ స్పూన్లు, లెమన్ ఎల్లో కలర్ - తగినంత, సోడియం బెంజోయేట్ - అర చెంచా అవసరం.




**తయారీ విధానం :** పైనాపిల్ తొక్క తీసి ముందుగా గ్రైండర్‌లో చేసుకోవాలి, తర్వాత బొప్పాయిని కూడా గ్రైండర్‌తో తురుముకోవాలి. ఇప్పుడు పైనాపిల్ బొప్పాయి గుజ్జును కలిపి దానికి పంచదార వేసి పొయ్యి మీద పెట్టి సన్నటి సెగమీద కలుపుతూ ఉండాలి, ఇలా ఉడుకుతూ ఉన్నప్పుడు బుడగలు వచ్చేదాక ఆగి దానిని ప్లేట్‌లో వేసి చూసిన తర్వాత కిందకు దించాలి. దీనికి పైనాపిల్ ఎసెన్స్ సోడియం బెంజోయేట్, లెమన్

ఎల్లోరంగు కలిపి తడిలేని సీసాల్లో నింపుకోవాలి. చల్లారిన తర్వాత మూత పెట్టాలి.

**రెట్టింపు ఆదాయం :** పైనాపిల్‌తో ఇలా ఎన్నో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేస్తూ ఆదాయం పొందవచ్చు. ఈ విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడానికి ఎక్కువ పెట్టుబడి అవసరం లేదు. పైనాపిల్ అధికంగా దొరికే సమయంలో వీటి విలువ ఆధారిత ఉత్పత్తులు చేయడం వల్ల పెట్టుబడికి రెట్టింపు ఆదాయాన్ని పొందవచ్చు. ఉదాహరణకు ఒక కిలో పైనాపిల్ జామ్ తయారు చేయడానికి 50-60 ఖర్చవుతుంది. దానిని జామ్ బాటిల్ రూపంలో రూ. 100-120/- లకు అమ్ముకోవచ్చు మహిళలు. గ్రామీణ యువత పైనాపిల్‌తో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేస్తూ ఆర్థిక స్వావలంభనకు ఉపాధిని పొందవచ్చును.

కృషి విజ్ఞాన కేంద్రం, ఆమదాలవలస వారు (ఫోన్ నెం : 99080 1156, 99896 23822) పైనాపిల్ విలువ ఆధారిత ఉత్తత్తులపై శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి కలిగిన స్త్రీలు, యువత పైనాపిల్‌తో విలువ ఆధారిత ఉత్పత్తులపై తగిన శిక్షణ తీసుకొని ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు.







మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : **99896 23822, 99080 11456**



# వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర - వారిని బలోపేతం చేసే మార్గాలు

డా॥ ఐ. జ్యోతి, శాస్త్రవేత్త (గృహ విజ్ఞాన శాస్త్రం) మరియు డా॥ జి.యస్. పాండురంగ,
కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి.

**వ్య**వసాయ రంగంలో మహిళలు కీలకమైన పాత్ర కలిగి ఉన్నారు. వ్యవసాయ కార్య కళాపాలల్లో మహిళలు 60 శాతం కంటే ఎక్కువ శ్రమ శక్తిని అందిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు పని చేయడం ద్వారా వారు పని ఒత్తిడి మరియు శారీరక శ్రమకు లోనవుతున్నారు. నాటు వేయడం దగ్గర నుండి ధాన్యం నూర్పిడి వరకు ప్రతి దశలో మహిళలు ఒక ప్రత్యేకమైన మరియు ముఖ్యమైన పాత్ర పోషిస్తూ ఉన్నారు .

అధ్యయనాల ప్రకారం వ్యవసాయ కార్యకలాపాలైన నారు పోయడం, కలుపు తీయడం, పంట కోత, పంట రవాణా, పంటల నూర్పిడి, పశువుల సంరక్షణ మరియు కుటుంబ పోషణ వంటి పనులలో మహిళలు ఎక్కువగా తమ కండ బలాన్ని ఉపయోగించడం వలన పని ఒత్తిడి మరియు శారీరక శ్రమ పెరుగుతుంది.

వ్యవసాయ భూమి లేని మహిళలు కూడా రోజువారి వ్యవసాయ కూలి పనులకు వెళుతుండటం, వీటితో పాటు గృహ అవసరాల కోసం నీటిని తీసుకు రావడం, కట్టెల సేకరణ కోసం కొన్ని మైళ్ళు కాలి నడకన వెళ్లి తిరిగి అధిక బరువులు తలపై మోసుకొని రావడం వంటి పనులు కలిగి ఉంటారు. ఈ విధంగా అధిక పని భారం వలన అనారోగ్యం సంభవించినప్పుడు లేదా ఆహార కొరత ఏర్పడినప్పుడు మహిళల



తో పాటు వారి చిన్నారులు (ప్రత్యేకించి ఐదు సంవత్సరాలు లోపు) పోషకాహార లోపానికి గురి అవుతున్నారు. పంట పొలాల్లో పిచికారి చేసే వివిధ రకాల రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాటి ద్వారా మహిళలు శ్వాస సంబంధిత మరియు చర్మ సంబంధిత వ్యాధులకు గురి అవుతున్నారు.

**మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు వారి సాధికారత కోసం తీసుకోవలసిన చర్యలు :**

గ్రామీణ మహిళలను ప్రోత్సహించడం మరియు పనిభారాన్ని తగ్గించడానికి సిఫారసు చేయబడిన వివిధ సాంకేతిక విధానాలను మహిళలు అనుసరించడం ద్వారా వారి జీవన స్థితిగతులను మెరుగుపరచవచ్చు. మహిళ సాధికారత ద్వారా మహిళలలో మార్పు తీసుకొనిరావచ్చు.

**విద్యా సాధికారత :**

విద్య అనేది మహిళల సాధికారతకు ఒక మైలురాయి. ఇది మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి అవసరం.

కుటుంబంలో మరియు సమాజంలో విమర్శనాత్మకంగా ఆలోచించే సామర్థ్యం, స్వీయ అభివృద్ధి, విశ్వాసం మరియు ఆత్మగౌరవం, నిర్ణయం తీసుకునే సామర్థ్యంను పెంచుతుంది.

**సామాజిక సాధికారత :**

గ్రామీణ మహిళలు క్లిష్ట పరిస్థితులలో జీవించడానికి ప్రధాన కారణం బలమైన సామాజిక సాంస్కృతిక అంశాలు. మహిళలు వారి ప్రస్తుత స్థితిగతులకు మించి ఆలోచించే సామర్థ్యం లేకపోవడం వలన మరియు మెరుగైన జీవన విధానం జీవించడం అనే అంశాల మీద అవగాహన లేని స్థితిలో ఉన్నారు. మహిళలను ప్రోత్సహించడం మరియు వారి జీవన పరిస్థితులను మెరుగు పరచడం కోసం సామాజిక స్థాయిలో చర్యలు తీసుకోవడం ఎంతైనా అవసరము.

క్రింద పేర్కొన్న అంశాలలో చర్యలు తీసుకోవడం ద్వారా మహిళల్లో మంచి పురోగతిని తీసుకురావచ్చు

- మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపోదించాలి మరియు కుటుంబాన్ని పోషించడం, సేద్యం, పశు సంరక్షణలో మహిళల పాత్రను మరియు బాధ్యతలను గుర్తించాలి.
- ప్రత్యేకంగా మహిళల కోసం సమర్థవంతమైన విస్తరణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి.
- మహిళలను ఆటంకపరిచే ప్రతికూల పరిస్థితులను అధిగ మించేందుకు వారిని ప్రోత్సహించాలి .
- వివిధ రకాలైన సామాజిక కార్యక్రమాలలో మహిళలకు అవకాశం ఇవ్వడం వలన వారికి ఆత్మగౌరవం మరియు ప్రోత్సాహం కలుగుతుంది.
- సురక్షితమైన మాతృత్వానికి కావలసిన ఆరోగ్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.
- తక్కువ ఖర్చు, ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల ఉత్పత్తులపై స్త్రీ మరియు పురుషులకు కూడా అవగాహన కల్పించాలి.

**ఆర్థిక సాధికారత :**

- వృత్తి శిక్షణ కార్యక్రమాలను అందించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను కల్పించవచ్చు.
- వ్యవసాయ మహిళల ద్వారా ప్రతి గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ కేంద్రాలను మరియు పిల్లల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
- గ్రామీణ సహకార సంఘాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.
- సహకార సంఘాల్లో నిర్ణయాత్మక పాత్రలు కల్పించాలి .
- సహకార సంఘాల్లో రుణాలను పొందే విధానాలు మరియు వాటికి దరఖాస్తు చేసుకునే విధానాల గురించి అవగాహన కల్పించాలి.

**సాంకేతిక సాధికారత :**

- వ్యవసాయ రంగానికి వెన్నెముక అయిన మహిళలకు వ్యవసాయం, పశు సంరక్షణ మరియు గృహ విజ్ఞానం వంటి అంశాల్లో వస్తున్న పురోగతిని తెలుసుకోవడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానం అవసరం.
- వ్యవసాయ రంగంలోని వివిధ కార్యకలాపాల కోసం రూపొం దించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మహిళలకు వివరించి వాటిని ఆచరణలో పెట్టేల ప్రోత్సహించాలి.
- తక్కువ ఖర్చు మరియు మహిళల శారీరక శ్రమను సమర్థ వంతంగా తగ్గించే పనిముట్లకు రూప కల్పన చేయాలి మరియు అటువంటి పనిముట్ల యొక్క ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలి.
- గృహ స్థాయిలో చేయగల ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ అంశాలపై శిక్షణ ఇవ్వాలి. మహిళలకు స్వయం ఉపాధి ఏర్పరచుకునేందుకు కావలసిన వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి.
- సమర్థవంతమైన విస్తరణ విధానాలను రూపొందించి అభివృద్ధి చేయడం ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని సులభంగా అందించవచ్చు. దీని ద్వారా వ్యవసాయ మహిళలు వాటిని నేర్చుకొని అమలు చేయడానికి సులభంగా ఉంటుంది.

అగ్రి-ఇన్‌పుట్‌లు, ఉచిత సాంకేతిక మార్గదర్శకత్వం, వ్యవసాయ సలహాదారు, వినియోగదారు ఉత్పత్తులు, ఆర్థిక, ఆరోగ్య సంరక్షణ, విద్య అనే అంశాల మీద దృష్టి పెట్టడం ద్వారా వ్యవసాయ మహిళల యొక్క పురోగతిని సాధించవచ్చు.

**మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన**
**ఫోన్ నెం : 85208 87745**

## శ్రీ బళ్ళారి రాఘవ గారి జయంతి

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శ్రీ బళ్ళారి రాఘవ గారి జయంతిని పురస్కరించుకొని తేది 02.08.2023 న విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు డా॥ ఎల్. ప్రశాంతి గారు, విశ్వవిద్యాలయ పరిపాలనా భవనములో శ్రీ బళ్ళారి రాఘవ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ బళ్ళారి రాఘవ గారు ఆగష్టు 2 వ తేది 1880 లో జన్మించారని, ప్రముఖ న్యాయవాది అయిన, నాటకాలలో మక్కువతో తన సమయాన్ని మరియు సంపదను నాటక రంగ పురోగతికి వెచ్చించారని, 12 వ ఏట నుండి రంగస్థలంపై నటించడము మొదలు పెట్టి, వివిధ భాషలలో మరియు పలు దేశాలలో నటించారని, స్త్రీలను నాటకాలలో ప్రోత్సహించారు అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర మరియు సహాయ సిబ్బంది పాల్గొని పుష్పాంజలి ఘటించారు.

## మేరీ మట్టి - మేరీ దేశ్ కార్యక్రమం

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లోని సామాజిక విజ్ఞాన కళాశాల, లాం ఆధ్వర్యంలో "మేరీ మట్టి - మేరీ దేశ్" కార్యక్రమాన్ని 09.08.2023 న జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన్ రెడ్డి గారు, పరిశోధన సంచాలకులు డా॥ ఎల్. ప్రశాంతి గారు, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా॥ జి. రామారావు గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పండ్ల మొక్కలను నాటడం జరిగింది. కళాశాల అసోసియేట్ డీన్ డా॥ చైతన్య కుమారి, బోధన మరియు బోధనేతర సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్, కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు, ప్రతి ఒక్కరు ఒక మొక్క చొప్పున కళాశాల ప్రాంగణంలో నాటారు మరియు వాటి యొక్క సంరక్షణ బాధ్యతను చేపట్టారు.

## ఇంటరాక్టివ్ వర్క్ షాప్

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని కృష్ణా ఆడిటోరియంలో తేది 09.08.2023 న రైతులకు సాంకేతికతను చేరవేసేందుకు స్ట్రాటజీని అభివృద్ధి పరచుట, డిజిటల్ టూల్స్ పై ఇంటరాక్టివ్ వర్క్ షాప్ సెంటర్ ఫర్ అగ్రికల్చరల్ & బయోకంట్రోల్ ఇంటర్నేషనల్ వారు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేసారు. ఈ వర్క్ షాప్‌లో విశ్వవిద్యాలయ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రాలు / ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విస్తరణ సంచాలకులు డా॥ ఏ. సుబ్బరామిరెడ్డి గారి అధ్యక్షతన నిర్వహించారు.

## 77 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గౌరవ రిజిస్ట్రార్ డా॥ జి. రామారావు గారి అధ్యక్షతన 77 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలో గౌరవ రిజిస్ట్రార్ డా॥ జి. రామారావు గారు జాతీయ జెండాను ఆవిష్కరించి, విశ్వవిద్యాలయ అధికారులు, బోధనా మరియు బోధనేతర సిబ్బందితో కూడి జెండా వందనం గావించి జాతిపిత శ్రీ మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ గారికి పూలమాలలు వేసి పుష్ప నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే, నేడు మనం అనుభవిస్తున్న మన దేశ స్వాతంత్ర్యం, బ్రిటిష్ వారి నిరంకుశ పాలనను ఎదురొడ్డి పోరాడిన ఎంతో మంది స్వతంత్ర పోరాట మరియు సమర యోధులైన త్యాగధనుల ఫలమేనన్నారు. ఇటువంటి స్వాతంత్ర్య పోరాట సమర యోధుల త్యాగాలతో సాధించుకొన్న స్వాతంత్ర్య భారతవనికి మన విశ్వవిద్యాలయం తరపున మనమిచ్చే నిజమైన నివాళి ఎవరికి వారు వారి వారి ప్రత్యేక విభాగాలలో నిరంతర శ్రమతో మరియు నిబద్ధతతో కూడిన శ్రద్ధ కనబరిచి తద్వారా దేశ ప్రగతి తోడ్పడటమేనని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన 26 జిల్లాల్లో విస్తరణ కేంద్రాలను ఏర్పాటు చేయటం, ఇ-ఆఫీస్ అమలు చేయటం, 55 సంస్థలతో యం.ఓ.యు. చేసుకోవటం, డ్రోన్ టెక్నాలజీ, 35 నూతన వంగడాలు విడుదల చేయటం, 2 వ్యవసాయ కళాశాలలు (పులివెందుల మరియు ఉదయగిరి) ఏర్పాటు చేయటం, ఆర్.బి.కె. లతో విద్యార్ధులను అనుసంధానం చేసి వారి సిబ్బందికి శిక్షణా కార్యక్రమములు నిర్వహించటం, అగ్రి-టూరిజం, సేంద్రీయ వ్యవసాయం, రోబోటిక్స్ లపై పరిశోధనలు చేయటం లాంటి పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి గౌరవ రిజిస్ట్రార్ డా॥ జి. రామారావు గారు వివరించారు.

ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన బోధనేతర సిబ్బందికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా॥ ఏ. విష్ణువర్ధన్ రెడ్డి గారు బహుమతులు ప్రధానం చేశారు మరియు అలాగే ఈ వేడుకలో విశ్వవిద్యాలయ అధికారులు మరియు సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు

డా॥ ఏ. మనోజ్, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం);
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, గుంటూరు – 522 034

**గౌతమ్, పేకేరు, పామర్రు, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా.**

**ప్ర. సాధారణ రకాలతో పోల్చుకుంటే స్వర్ణ రకాన్ని సాగు చేసేటప్పుడు నత్రజని ఎరువుల యాజమాన్యంలో ఏదైనా మార్పు ఉంటుందా తెలియజేయండి ?**

**జ.** స్వర్ణ రకం మరియు యం.టి.యు. 1318 వేసేటప్పుడు ఎకరాకు సిఫారసు చేసిన 24 కిలోల నత్రజనిని 3 భాగాలు బదులుగా 2 భాగాలుగా చేసి, సగ భాగం ఆఖరి దమ్ములోను మిగతా సగ భాగం అంకురం ఏర్పడే దశలో వేయాలి. నత్రజని ఎక్కువగా వేసేటప్పుడు పంటకాలంలో చీడపీడల సమస్య ఎక్కువగా ఉంటుంది.

**దినేష్, విడవలోరు, నెల్లూరు జిల్లా.**

**ప్ర. వరిలో ఆకుముడత మరియు ఆకునల్లి నివారణ తెలియజేయండి ?**

**జ.** వరిలో ఆకుముడత నివారణకు క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అదే ఆకునల్లి నివారణకైతే నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా డైకోఫాల్ 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**చంద్రశేఖర్ గౌడ్, కర్నూలు జిల్లా.**

**ప్ర. మినుమును విత్తుటకు అనువైన సమయాలను తెలియజేయండి?**

**జ.** మినుములో సరైన దిగుబడులు పొందాలంటే ఖరీఫ్ పంటగా జూన్ 15 నుంచి జులై 15 వరకు, రబీ పంటగా అక్టోబరు లోను, వరి మాగాణుల్లో నవంబర్ నుంచి డిసెంబర్ వరకు మరియు వేసవిలో ఫిబ్రవరి నుంచి మార్చి వరకు విత్తుకోవచ్చు.

**సోమిరెడ్డి, లంకేలకురపాడు, ముప్పాల, పల్నాడు జిల్లా.**

**ప్ర. టి.బి.జి. 104 రకం లక్షణాలను అవి లభ్యమైన ప్రదేశాలను వివరించండి ?**

**జ.** 70 నుంచి 75 రోజుల పంటకాలం కలిగి, పల్లాకు తెగులుకు సమర్ధవంతంగా తట్టుకొని ఎకరానికి 8–9 క్వింటాలు దిగుబడినిస్తూ అన్ని కాలాలకు అనువైన రకం. ఈ రకం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం మరియు తిరుపతిలో లభ్యమవుతుంది.

**నవనీత్ కిషోర్, పాండిచ్చేరి, తమిళనాడు.**

**ప్ర. ఎన్.ఎల్.ఆర్. 40054 గురించి తెలియజేయండి ?**

**జ.** ఈ రకం అన్ని కాలాలకు అనుకూలం. ఎడగారు మరియు ఖరీఫ్‌లో 135 రోజులు, రబీలో 125 రోజులు పంటకాలం కలిగి ఎకరాకు 28 నుంచి 30 క్వింటాలు దిగుబడి ఇస్తుంది. కొంతవరకు అగ్గితెగులు మరియు ఉల్లికోడును తట్టుకొనును. భాసుమతి వాసన కలిగిన సన్న గింజ రకం. తక్కువ నత్రజనితో ఎక్కువ దిగుబడినిచ్చే పొట్టి రకం. ఇది వ్యవసాయ పరిశోధదనా స్థానం, నెల్లూరులో అందుబాటులో ఉంటుంది.

**మహమ్మద్ రఫీ, కృష్ణగిరి, కర్నూలు జిల్లా.**

**ప్ర. కంది వేసి 20 రోజులైంది. వర్షాలు కారణంగా అంతరకృషి చేయడం కుదరడం లేదు తుంగ, వెడల్పాకు ఎక్కువగా ఉంది. నివారణ తెలియజేయండి. ?**

**జ.** గడ్డి జాతి మరియు వెడల్పాటి ఆకు కలుపు నివారణకు ఎకరానికి ఇమాజితాఫిర్ 300 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.



పంటల సాగులో సలహాల కోసం ఫార్మర్స్ కాల్ సెంటర్ 1800 425 0430 ను సంప్రదించండి.

**రామచంద్రరావు, మోపిదేవి, కృష్ణా జిల్లా.**

**ప్ర. ఎద వరిలో కలుపు యాజమాన్యం వివరించండి ?**

**జ.** విత్తిన వెంటనే ఎకరాకు 1 లీటరు పెండిమిథాలిన్ 30% లేదా 400 మి.లీ. ప్రిటలాక్లోర్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. విత్తిన 15 నుంచి 20 రోజులకు ఊద ఎక్కువగా ఉంటే 400 మి.లీ. సైహలోఫాప్ బ్యూటైల్ లేదా గడ్డి మరియు వెడల్పాకు రెండు ఉంటే బిస్‌పైరిబాక్ సోడియం 100 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాకు ఎక్కువగా ఉంటే 8 గ్రా. మెటాసల్ఫ్యూరాన్ మిథైల్ + క్లోరిమ్యూరాన్ ఇథైల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. కలుపు 2 నుంచి 4 ఆకుల దశలో ఉన్నప్పుడు కలుపు మందులు పిచికారి చేస్తే కలుపును సమర్థవంతంగా నివారించవచ్చు.

**రాము, పిడుగురాళ్ళ, పల్నాడు జిల్లా.**

**ప్ర. టేకును నాటుటకు విత్తు దూరం మరియు అనుకూలమైన సమయం తెలియజేయండి ?**

**జ.** టేకును జులై నెలలో 3×1.3 మీటర్ల దూరంలో వాలుకి అడ్డంగా నాటుకోవాలి. ఎకరాకు 1000 మొక్కలు నాటాలి.

**ప్రసాద్, మున్నంగి, కొల్లిపర, గుంటూరు జిల్లా.**

**ప్ర. ఎద వరి సాగులో ఎరువుల యాజమాన్యం తెలియజేయండి ?**

**జ.** భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. మొత్తం భాస్వరం మరియు సగభాగం పొటాష్‌ను ఆఖరి దమ్ములో వేయాలి. నత్రజనిని 3 సమ భాగాలుగా చేసి 1/3 భాగం నాటిన 15-20 రోజులకు, 1/3 భాగం నాటిన 40-45 రోజులకు వేయాలి. మిగిలిన 1/3 భాగం నత్రజనిని, మిగిలిన సగభాగం పొటాష్‌తో నాటిన 60-65 రోజులకు వేయాలి.

**శ్రీనివాసరెడ్డి, కరీంనగర్, తెలంగాణ.**

**ప్ర. యం.టి.యు. 1232 లక్షణాలు లభ్యత వివరాలు చెప్పండి?**

**జ.** ఈ రకం సాధారణ పరిస్థితులలోను 135-145 రోజులు పంటకాలం కలిగి ఎకరాకు 24 క్వింటాలు, ముంపు పరిస్థితులలో 140-145 రోజులు పంటకాలం కలిగి ఎకరాకు 15 క్వింటాలు దిగుబడి ఇస్తూ, దోమ, అగ్గి తెగులును, చౌడును తట్టుకునే సన్న గింజ రకం.

**సునీత, తిరుపతి.**

**ప్ర. ఖరీఫ్ మరియు రబీలో వేసుకోదగ్గ రాగి రకాలను గురించి తెలియజేయండి ?**

**జ.** రాగిలో భారతి, తిరుమల, వేగావతి, సువర్ణముఖి, సి.ఎఫ్.యం.వి. 4, ఇంద్రావతి, గోస్థని, గౌతమి, వకుళ, శ్రీ చైతన్య, సప్తగిరి రత్నగిరి మరియు గోదావరి వంటి రకాలు ఎకరానికి 12 నుంచి 16 క్వింటాలు వరకు దిగుబడి ఇస్తూ ఖరీఫ్ మరియు రబీ కాలంలో వేసుకొనుటకు అనుగుణంగా ఉంటాయి.

**పావని, నార్పల, అనంతపురం జిల్లా.**

**ప్ర. కొర్ర రకం రేనేడు ఎటువంటి నేలలకు అనుకూలంగా ఉంటుంది మరియు దిగుబడి వివరాలు తెలియజేయండి ?**

**జ.** తేలిక నుండి మధ్య రకం నేలలు బాగా అనుకూలం. మురుగు నీరు పారుదల సౌకర్యం గల నల్ల రేగడి నేలల్లో కూడ పండించవచ్చు. ఎకరానికి సరాసరి 11-13 క్వింటాలు వరకు దిగుబడి ఇస్తుంది.

**ప్రవీణ్, కొండమూడి, పొన్నూరు, గుంటూరు జిల్లా.**

**ప్ర. వరి రకం యం.సి.యం. 100 గురించి తెలియజేయండి?**

**జ.** యం.సి.యం. 100 (పాండురంగా) 145 రోజులు పంట కాలం కలిగి, ఎకరాకు 24 క్వింటాలు దిగుబడినిస్తూ కొంతవరకు అగ్గితెగులును, ఆకుమచ్చ తెగులును తట్టుకొంటూ, చౌడును సమర్థవంతంగా తట్టుకునే రకం. చేనుపై పడిపోదు, గింజ రాలిక తక్కువ. మధ్యస్థ సన్న రకం. ముదురు నారు నాటిన కూడ పంట దిగుబడిలో తేడా ఉండదు. సార్వాలో వేసుకొనే రకం. వ్యవసాయ పరిశోధనా స్థానం, మచిలీపట్నంలో అందుబాటులో ఉంటాయి.

# నిరంతర సాగుతో నిలకడ ఆదాయం

డా॥ జి. చిట్టిబాబు, సీనియర్ శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ పి. వెంకట్రావు, సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం);
డా॥ జె. జగన్నాథం, సమన్వయ కర్త, ఏరువాక కేంద్రం, పాడేరు మరియు డా॥ యం. సురేష్ కుమార్,
సహ పరిశోధన సంచాలకులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, చింతపల్లి.



సరైన విధానంలో నిరంతరం పంటలు సాగు చేస్తే నిలకడ ఆదాయం పొందవచ్చని ఋజువు చేస్తుంది గిరిజన మహిళ. వ్యవసాయంలో వస్తున్న నష్టం తట్టుకోలేక ఎంతో మంది రైతు సోదరులు సాగు విడిచి పెడుతుంటే, సంవత్సర కాలం పొడవునా పంటలు పండిస్తూ, లాభాలను అర్జించవచ్చని నిరూపించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రీగూడ మండలం బలియగూడ గ్రామానికి చెందిన పాంగి వినీత (86932 10227), వయస్సు 20 ఏళ్ళు మాత్రమే. చదువుకోక పోయినా, సమీకృత వ్యవసాయ విధానాలను ఆచరిస్తూ, సంవత్సరానికి 5 లక్షల ఆదాయం పొందవచ్చని తెలియజేస్తుంది. కొండలపై వర్షాధారంగా పోడు వ్యవసాయంలో వరి, మొక్కజొన్న, రాగి, టమాటా, కొత్తిమీర వంటి పంటలను సాగు చేస్తూనే, తోట పంటలైన కాఫీ, మిరియాలు, పనస, చింత, అల్లం, పసుపు నుండి అధిక ఆదాయం పొందుతున్నారు.

**అంతర పంటలు అధిక లాభాలు :**

తనకున్న 6.5 ఎకరాల భూమిలో వివిధ రకాల పంటలు సంవత్సరం పొడవునా, దశల వారీగా సాగు చేయడం వినీత ప్రత్యేకత. మెట్ట భూములలో ఖరీఫ్ మరియు రబీ కాలంలో మొక్కజొన్నలో కంది, ప్రొద్దు తిరుగుడు, టమాటా వంటి పంటలను అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. అలాగే గట్ల మీద, మధ్య వరుసలలో ముల్లంగి దుంపలను సాగు చేస్తున్నారు. అలాగే టమాటా పంటను దశల వారీగా విత్తుకుంటూ, సంవత్సరం పొడవునా పంట పండించడం ఈమె ప్రత్యేకత. అలాగే కొత్తిమీర రబీ కాలం నుండి వేసవి కాలం మొత్తం సాగు చేస్తారు. ఈవిధంగా టమాటా ఎకరానికి ఖరీఫ్‌లో 10 క్వి., రబీ కాలంలో 12-13 క్వి., వేసవి కాలంలో 11 క్వింటాళ్ళ వరకు దిగుబడి సాధిస్తున్నారు. వరి, రాగి పంటలను లోతట్టు ప్రాంతాలలో వరుసలలో నాట్లు వేసే విధానం ద్వారా పండిస్తున్నారు. వరిలో సేంద్రీయ విధానాల ద్వారా పండిస్తూ ఎకరానికి సుమారు 16-18 క్వి. దిగుబడులు, రాగి పంట నుండి 8 క్వి. వరకు దిగుబడి లభిస్తుంది. అల్లం, పసుపు పంటలను కొండలపై సాగు చేస్తూ, తనకున్న సాగు విస్తీర్ణం (0.5 ఎకరాలు) నుండి పసుపు 1.5 టన్నులు, అల్లం 1.2 టన్నులు దిగుబడి పొందుతూ గ్రామంలోని ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అన్ని పంటలు పూర్తిగా సేంద్రీయ విధానంలో పండిస్తూ, నాణ్యమైన ఆహార ధాన్యాలను ధీంసా రైతు ఉత్పత్తి సంఘం ద్వారా మంచి ధరలకు అమ్ముకుని లాభం పొందుతున్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, చింతపల్లి మరియు అనకాపల్లి నుండి సంజీవని స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎప్పటికప్పుడు శాస్త్రీయ సలహాలు సూచనలు పొందుతూ సేంద్రీయ విధానాలు పాటించడం, జీవ నియంత్రణ పద్ధతులను పాటించడం వలన సాగు ఖర్చు బాగా తక్కువ. వ్యవసాయ పంటల ద్వారా సుమారు 3 లక్షల నికర ఆదాయం వార్షికంగా పొందుతున్నారు.

**తోట పంటలు :**

కాఫీ పంటను సుమారు అర ఎకరా విస్తీర్ణంలో పండిస్తూ, అలాగే అంతర పంటగా మిరియాలు కూడా సాగు చేస్తున్నారు. కాఫీ సుమారు 120 నుండి 150 కిలోలు, మిరియాలు 200 నుండి 260 కిలోల వరకు దిగుబడి పొందుతున్నారు. కాఫీ, మిరియాల నుండి వార్షికంగా సుమారు 1.5 లక్షల నికర ఆదాయం లభిస్తుంది. అలాగే ఇతర తోటలైన పనస, చింత నుండి కూడా వార్షికంగా సుమారు రూ. 30,000/- పొందుతున్నారు.

**సమీకృత వ్యవసాయం :**

సాగు పంటలతో పాటు, పెరటి కోళ్ళ పెంపకం చేపడుతూ, వార్షికంగా సుమారు 20 కోళ్ళను తయారు చేస్తూ మార్కెట్‌కు అమ్ముకోవడం ద్వారా, సుమారు రూ. 20,000/- వరకు నికర ఆదాయం పొందుతున్నారు. అలాగే గొర్రెలు, మేకలు నుండి సుమారు రూ. 25,000/- వరకు నికర ఆదాయం లభిస్తుంది. ఆవులు, ఎద్దులను కూడా పోషిస్తూ సమీకృత వ్యవసాయ విధానాలను పాటిస్తున్నారు.

**అవార్డులు మరియు గుర్తింపు :**

- ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, 12 జూన్ 2023 వ తేదీన రాష్ట్ర స్థాయి ఉత్తమ మహిళా రైతుగా అవార్డు మరియు రూ. 25,000/- పారితోషికం అందుకున్నారు.
- సంజీవని స్వచ్ఛంధ సంస్థ నిర్వహించే విత్తనాల పండుగ సందర్భంగా, 28 ఏప్రిల్ 2023 వ తేదీన ఉత్తమ మహిళా రైతుగా గుర్తింపు మరియు సత్కారం అందుకున్నారు.








మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 98490 35068



ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, లాం వారి నూతన పెసర రకం 'ఎల్.జి.జి. 630'

RNI NO : APTEL/2012/46939 **SEPTEMBER 2023** Postal Regd. No. GTR/82/2022-24
Date of Publication : 07-09-2023
Date of Posting 09-09-2023

# ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం యూట్యూబ్ ఛానల్




ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి యూట్యూబ్ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకొని ఎప్పటికప్పుడు క్రొత్త క్రొత్త విషయాలను దృశ్య రూపంలో చూసుకొని, నాణ్యమైన అధిక దిగుబడులను పెంపొందించుకోవలసిందిగా రైతులకు విజ్ఞప్తి.

ANGRAU

## ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

### లాం, గుంటూరు - 522 034

ముద్రణ & ప్రచురణ కర్త : ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి, ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము, గుంటూరు.
ముద్రణాలయం : ప్రజాశక్తి ప్రింటర్స్ & పబ్లిషర్స్ ప్రై.లి., కృష్ణనగర్, తాడేపల్లి, గుంటూరు జిల్లా.